మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 25-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 115 Issue: 115

Published from Jagitial
www.evarthalu.com

25 అక్టోబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:15 సూర్యాస్తమయం - సా. 5:44 తిథిః చవితి తె. 3:47ం వరకు తరువాత పంచమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం అనురాధ ఉ. 7:44 వరకు తరువాత జ్యేష్ఠ యోగం శోభన ఉ. 6:43ం వరకు కరణం వనిజ మ. 2:34 వరకు విష్టి తె. 3:47ం వరకు వర్జ్యం మ. 2:08 నుండి మ. 3:56 వరకు దుర్ముహూర్తం ఉ. 7:47 నుండి ఉ. 8:33 వరకు రాహుకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:34 వరకు యమగండం మ. 1:26 నుండి మ. 2:52 వరకు గుళికాకాలం ఉ. 6:15 నుండి ఉ. 7:41 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:39 నుండి తె. 5:27 వరకు అమృత ఘడియలు రా. 12:53 నుండి రా. 2:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:23 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## స్వదేశీ ట్రైనర్ ఫ్లైట్.. గగన విహారం

### అందుబాటులోకి హెచ్‌టీటీ-40 విమానం.. ఎయిర్ వారియర్స్ శిక్షణకు ఉపయోగం

ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా, దేశ రక్షణ, విమాన యాన రంగాల్లో స్వావలంబన దిశగా మరో అడుగు పడింది. భారత సాయుధ దళాల శిక్షణ అవసరాలకు తగ్గట్లు, స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన హిందూస్థాన్ టర్బో ట్రైనర్ ఫ్లైట్-40 (హెచ్‌టీటీ-40) విజయవంతంగా గగన విహారం చేసింది. బెంగళూరులో దీన్ని విజయవంతంగా నడిపినట్లు హాల్ వెల్లడించింది.

బెంగళూరు: ముందు ఒకరు, వెనక ఒకరు కూర్చునేలా డిజైన్ చేసిన ఈ ఫ్లైట్‌ను బేసిక్ ఫ్లైట్ ట్రైనింగ్, వైమానిక విన్యాసాలు, నైట్ ఫ్లయింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగించనున్నారు. ఈ విమానంలో పూర్తి యాంత్రిక సిమ్యులేటర్ కూడా ఉంది. దీని ద్వారా, పైలట్‌లు ఆకాశంలోకి వెళ్లకుండా నేలపైనే విభిన్న గగనతల పరిస్థితులను సృష్టించుకుని శిక్షణ పొందవచ్చు. మొత్తం 70 విమానాలను హాల్ తయారు చేసి, వైమానిక దళానికి అందించనుంది.

**హెచ్‌టీటీ-40 విశేషాలు**

- హెచ్‌టీటీ-40 పూర్తిగా ఏరోబాటిక్ విమానం.
- నాలుగు రెక్కలు ఉన్న ఇంజిన్‌తో పనిచేస్తుంది.
- అత్యాధునిక గ్లాస్ కాక్‌పిట్, ఆధునిక పరికరాలు, జీరో-జీరో ఎజెక్షన్ సీటు ప్రత్యేకతలు.
- విమాన గరిష్ట వేగం గంటకు 450 కిలోమీటర్లు
- గరిష్టంగా ఆరు కిలోమీటర్ల ఎత్తుకు ఎగరగలదు.

## 20 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతి

### తప్పించుకున్న 21 మంది ప్రయాణికులు

### కర్నూలు జిల్లా చిన్నటేకూరులో ఘోరం




# బస్సే చితి

శుక్రవారం తెల్లవారుజామున.. సమయం 3.30 గంటలు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన ప్రైవేట్ బస్సు కర్నూలు శివారుకు చేరుకుంది. బస్సులోని ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నారు.. బస్సు డ్రైవర్ కూడా మంచి స్పీడులో ఉన్నాడు.. మరికొన్ని గంటల్లో గమ్యం చేరేవాళ్లే. కానీ.. ఒక్కసారిగా బస్సువైపు ఓ బైక్ మృత్యువులా దూసుకొచ్చింది. బస్సు కింద పడి నిప్పు రవ్వల్ని చిమ్మింది. అంతే.. ఒక్కసారిగా మంటలు భగ్గుమన్నాయి. ఏం జరుగుతోంది అనుకొనేలోపే బస్సు కింది భాగంలోని డీజిల్ ట్యాంకర్‌కు మంటలు అంటుకొని అగ్నికీలలు చెలరేగాయి. చూస్తుండగానే బస్సు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఆ మంటల్లో 20 మంది మాంసం ముద్దలయ్యారు.

## బైక్ ఢీకొని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

- శుక్రవారం తెల్లవారుజామున దారుణ ఘటన
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం
- ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని, సీఎంల దిగ్భ్రాంతి
- ప్రమాదానికి గురైన బస్సుపై 16 చలాన్లు
- విచారణకు ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్

కర్నూలు/హైదరాబాద్/అమరావతి, అక్టోబర్ 24 (ఈవార్తలు) : ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు (డీడీ01ఎన్9490) హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్నది. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో కర్నూలు శివారు చిన్నటేకూరు సమీపంలో ఓ బైకును ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా తరువాయి 2 వ పేజీలో...




## ప్రమాదానికి గురైన బస్సుపై 16 చలాన్లు

ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి.

హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. కాగా, ప్రమాదానికి గురైన బస్సు డీడీ01 N9490 నంబరుతో రిజిస్టర్ అయినట్లు ఏపీ రవాణా శాఖ వెల్లడించింది. ఈ బస్సు ఫిట్‌గానే ఉందని, బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయని తెలిపింది. 'కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి బస్సు నడుపుతున్నారు. 2018 మే 2న బస్సును డామన్ దయ్యూలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ బస్సుకు 2030 ఏప్రిల్ 30 వరకు టూరిస్ట్ పర్మిట్ జారీ అయ్యింది. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌గా ఉంది. 2027 మార్చి 31 వరకు ఫిట్‌నెస్ ఉంది. 2026 ఏప్రిల్ 20 వరకు బస్సుకు ఇన్సూరెన్స్ ఉంది. బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయి. అన్ని కోణాల్లో పూర్థిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తు నివేదిక మేరకు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం' అని రవాణా శాఖ పేర్కొంది.

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,437 |
| వెండి (గ్రాము): | రూ.170 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,584 |

## చదువు రానోడు.. విద్యామంత్రి!



- అన్ని శాఖల్లో మంత్రిగా రేవంత్ ఫెయిల్
- కలెక్షన్లు, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్
- సీఎం రేవంత్‌పై హరీశ్ తీవ్ర ఆరోపణలు

విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హెూం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హెూం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు.

## ఎఫ్ఎస్‌వోలుగా అడిషనల్ కలెక్టర్లు

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో ఒక కీలకమైన మార్పును తీసుకొచ్చింది. అటవీ భూములకు సంబంధించిన సమస్యలను వేగంగా.. పారదర్శకంగా పరిష్కరించే ఉద్దేశంతో జాయింట్ కలెక్టర్ పదవిని రద్దు చేసి.. అదనపు కలెక్టర్లకు కొత్త బాధ్యతలను అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లను ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ఈ నియామకాలను 1967 ఫారెస్ట్ యాక్ట్, 1927 నాటి చట్టాల నిబంధనల కింద అమలు చేస్తోంది. ఈ మార్పు ద్వారా పాలనలో వేగం, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌ల ప్రాథమిక విధి అటవీ భూముల హక్కుల నిర్ధారణ, అటవీ ప్రాంతాల పరిధిని నిర్ధారించడం. ఈ నూతన బాధ్యతల కింద అటవీ భూ సర్వే నిర్వహించడం, హక్కుల నిర్ధారణ ప్రక్రియను పర్యవేక్షించడం, సెటిల్‌మెంట్ పనులను పూర్తి చేయడం వంటివి ఉంటాయి. ఎఫ్ఎస్‌వోలు భూముల వివరాలను సమగ్రంగా తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



నార్వే పెన్షన్ ఫండ్ రెండు ట్రిలియన్ డాలర్ల(రూ.1 కోటి 75 లక్షల కోట్లు) కు చేరింది. ఈ ఫండ్ సగటున నార్వేలోని ఒక్కో పౌరుడికి 3,40,000 డాలర్లు (2.98 కోట్లు) అందుతాయి. అయితే, ఈ డబ్బును ప్రజలకు పంచిపెట్టరు. ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు పెడతారు. ఆ దేశ ఆర్థికాన్ని కాపాడేందుకు 1990లో ఈ ఫండ్ ఏర్పాటైంది.

## జూబ్లీహిల్స్‌లో 4,01,365 మంది ఓటర్లు



- 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది స్త్రీలు
- తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం
- నోటిఫికేషన్ తర్వాత పెరిగిన 2,383 మంది ఓటర్లు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ఈ మేరకు ఆయన శవివారం మీడియా ద్వారా వివరాలు తెలియజేశారు. నియోజకవర్గంలో నాలుగు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని, వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నిత్యం తనిఖీలు తరువాయి 2 వ పేజీలో...



## 2,863 కోట్లు వైన్స్ దరఖాస్తులతో సర్కారుకు భారీ ఆదాయం

### 95,436 అప్లికేషన్లు.. ముగిసిన స్వీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): రాష్ట్రంలో కొత్తగా మద్యం దుకాణాల కేటాయింపుల కోసం దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ గురువారం ముగిసింది. ఈసారి మొత్తం 95,436 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.2,863 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది గత సంవత్సరం కంటే రూ.218 కోట్లు ఎక్కువ కావడం విశేషం. దీంతో తెలంగాణ ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన ఆదాయ లక్ష్యం దాదాపుగా తరువాయి 2 వ పేజీలో...



## ఢిల్లీకి సీఎం రేవంత్

- నేడు ఏఐసీసీ కార్యాలయంలో ఖర్గేతో భేటీ
- డీసీసీ అధ్యక్షుల నియామకంపై కసరత్తు

## రాశి ఫలాలు

25.10.2025

మేషం: బంధువులతో వివాదాలు పరిష్కారమవుతాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరాశ పరుస్తాయి. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించాలి. ఆలయాలు దర్శనాలు చేసుకుంటారు.

వృషభం: వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తప్పవు. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ధన పరంగా ఇతరులకు మాట ఇచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటారు. రుణదాతల నుండి ఒత్తిడులు అధికమవుతాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

మిధునం: మొండి బాకీలు వసూలు చేసుకుంటారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలను అందుతాయి. రాజకీయ ప్రముఖుల నుండి సభ, సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి.

కర్కాటకం: ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందగలుగుతారు. అవసరానికి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపార పరంగా తీసుకున్న నిర్ణయాలు అనుకూల ఫలితాలనిస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. సంతాన వివాహ విషయమై చర్చలు ఫలిస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

సింహం: వృధా ఖర్చులు విషయంలో పునరాలోచన చేయటం మంచిది. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి. పెద్దల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. దూరప్రయాణాలు వాయిదా పడతాయి.

కన్య: విద్యార్థులకు ఒత్తిడులు తప్పవు. చేపట్టిన పనుల్లో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగపరంగా అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు కొంత నిరుత్సాహ పరుస్తాయి.

తుల: వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. గృహమున కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. విందు వినోదాది కార్యక్రమాలకు హాజరు అవుతారు.

వృశ్చికం: చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. బంధుమిత్రుల నుంచి కొన్ని పనులలో ఒత్తిడి అధికమవుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు.

ధనస్సు: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో ఒత్తిడి నుండి బయట పడతారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. నిరుద్యోగుల యత్నాలు ముందుకు సాగవు. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆరోగ్యపరంగా కొంత జాగ్రత్త అవసరం.

కుంభం: ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సమాజంలో ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

మీనం: కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. విందు వినోద కార్యక్రమాలకు హాజరవుతారు.





# బస్సే చితి



**మొదటి పేజీ తరువాయి**

మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బస్సు మొత్తానికి విస్తరించడంతో భారీగా అగ్నికీలలు చెలరేగాయి. చూస్తుండగానే బస్సు మొత్తం అగ్నికి ఆహుతైంది. అంతా నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో 19 మంది సజీవదహనం అయ్యారు. ప్రమాదం సమయంలో బస్సులో 42 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఎమర్జెన్సీ డోర్ నుంచి 21 మంది తప్పించుకున్నారు. బస్సును ఢీకొట్టిన బైకర్ కూడా మంటల్లో కాలిపోయాడు. సమాచారం పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. గాయపడిన వారిని కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ప్రమాదం తర్వాత ఘటనా స్థలం నుంచి ట్రావెల్స్ బస్సు డ్రైవర్, సిబ్బంది పరారయ్యారు. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్‌కు చెందిన వారు ఉన్నారు. కాగా, తెలంగాణకు చెందిన మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్ రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తిగా చికిత్స అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. మరోవైపు, బస్సు ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మరోవైపు మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గొల్లవారిపల్లిలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. గొల్ల రమేశ్ సహా నలుగురు కుటుంబ సభ్యులు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంలో గొల్ల రమేశ్ (35), ఆయన భార్య అనూష (30), కుమార్తె మన్విత (10), కుమారుడు మనీశ్ (12) మృతి చెందారు.

### బైక్ ఢీకొట్టడం వల్లే ఘటన: కర్నూలు ఎస్పీ

బస్సు గురువారం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరిందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తుండగా బైకును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయన్నారు. గమనించిన డ్రైవర్, సహాయక డ్రైవర్‌ను నిద్రలేపాడు. చిన్న ప్రమాదమనుకుని వాటర్ బబుల్‌తో మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. మంటలు ఎక్కువయ్యేసరికి ప్రయాణికులను నిద్రలేపారు. కొందరు ఎమర్జెన్సీ డోర్లను బద్దలు కొట్టి కొందరు బయటపడ్డారు. హైవేపై వెళ్తున్నవారు కూడా సహాయం చేశారన్నారు. కొందరు ప్రయాణికులు కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్, సహాయక డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, ప్రమాదంపై ఇద్దరిని ప్రశ్నిస్తున్నామని పేర్కొన్నారు.

### ఘటనపై విచారణకు ఆదేశించాం: పొన్నం

కర్నూలు బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నుంచి బస్సు బయలుదేరిన నేపథ్యంలో.. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు బస్సుల వేగ నియంత్రణకు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో త్వరలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక మంత్రుల సమావేశం నిర్వహిస్తామన్నారు. బస్సుల్లో భద్రతా చర్యలపై నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు. ఓవర్ స్పీడ్ నియంత్రణకు కమిటీ వేస్తామని తెలిపారు. ప్రైవేటు ట్రావెల్స్ మధ్య అనారోగ్యకర పోటీ ఉందని, దాన్ని నివారిస్తామని పేర్కొన్నారు. మరోవైపు, ప్రమాద స్థలిని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. గద్వాల కలెక్టర్‌ను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

### మృతుల్లో ఇద్దరు పిల్లలు కూడా: ఏపీ మంత్రి అనిత

కర్నూలు ప్రమాద ఘటనపై ఏపీ హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ప్రమాదంలో ఇద్దరు పిల్లలు సహా 19 మంది మృతిచెందారని తెలిపారు. గాయాలతో కర్నూలు జీజీహెచ్‌లో ఆరుగురు చికిత్స పొందుతున్నారని, మరో ముగ్గురు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని వెల్లడించారు.

# చదువు రానోడు.. విద్యామంత్రి!

**అన్ని శాఖల్లో మంత్రిగా రేవంత్ ఫెయిల్.. కలెక్షన్లు, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్.. సీఎం రేవంత్‌పై హరీశ్ తీవ్ర ఆరోపణలు**

హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు) : విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 95 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో 15400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.





# జూబ్లీహిల్స్‌లో 4,01,365 మంది ఓటర్లు

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పటి వరకు రూ. 2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నామని, అలాగే రూ. 3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుకున్నామని తెలిపారు. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీప్యాట్ వినియోగిస్తామని పేర్కొన్నారు.

### ఫైనల్‌గా బరిలో 58 మంది

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. జూబ్లీహిల్స్ లో మొత్తం ఓటర్ల సంఖ్య- 4,01,365 ఉండగా, పురుషులు- 2,08,561, మహిళలు 1,92,779 మంది ఉన్నారన్నారు. ఇతరులు 25 మంది మాత్రమే ఉన్నారన్నారు. 'ముగ్గురు అబ్జర్వర్స్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటిస్తూ ఇన్స్పెక్షన్ చేస్తున్నారు. బ్యాలెట్ యూనిట్ లో అభ్యర్థుల కలర్ ఫోటో ఉంటుంది. ఈసారి 4 బ్యాలెట్ యూనిట్లు, ఒక వీవీ ప్యాట్ ఉంటుంది. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్ అసిస్టెంట్ బూత్ ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ స్టేషన్ వద్ద మొబైల్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ మొబైల్ డిపాజిట్ చేసి పోలింగ్ స్టేషన్‌కి వెళ్లాలి. పోలింగ్ స్టేషన్ లోపలికి ఓటర్లకు, ఏజెంట్లకు మొబైల్ అనుమతి లేదు' అని తెలిపారు.

### రూ.2.83 కోట్లు సీజ్ చేశాం

ఇప్పటివరకు 2 కోట్ల 83 లక్షల రూపాయల నగదు పట్టుకున్నామని పోలీస్ అడిషనల్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ స్పష్టం చేశారు. ' టీమ్స్ నియోజకవర్గంలో తిరుగుతున్నాయి. ఇప్పటివరకు 2 కోట్ల 83 లక్షల నగదు పట్టుకున్నాం. 512 లీటర్ల మద్యం సీజ్ చేశాం. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన వారిపై 11 కేసులు నమోదు చేశాం. సోషల్ మీడియా ప్రచారం పై నిఘా పెట్టాం. ఈవీఎంలు సరిపడా ఉన్నాయి. 20 శాతం ఈవీఎంల ఎక్స్‌ట్రా ఉన్నాయి. ఓటర్ స్లిప్పులు స్థానిక బూత్ లెవెల్ ఆఫీసర్లు ఓటర్లకు పంచుతారు. పొలిటికల్ పార్టీల వారు ఓటర్ స్లిప్పులు పంచితే కేసులు నమోదు చేస్తాం. ఈనెల 27న పారా మిలిటరీ బలగాలు వస్తున్నాయి. 8 కంపెనీల పారా మిలిటరీ బలగాలు నియోజకవర్గంలో పని చేస్తాయి. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో పారా మిలిటరీ బలగాలు విధుల్లో ఉంటాయి. 65 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి' అని పేర్కొన్నారు.

# ఎఫ్ఎస్‌వోలుగా అడిషనల్ కలెక్టర్లు

**మొదటి పేజీ తరువాయి**

పరిశీలించడం, అవకతవకలు ఉన్నవాటిపై విచారణ నిర్వహించడం, అటవీ భూములకు సంబంధించిన ప్రకటనలు జారీ చేయడం వంటి చట్టపరమైన కార్యకలాపాలను నిర్వహిస్తారు. వారికి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే అధికారం కూడా ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు , రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది.

### సాధారణ విధులు కూడా..

ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్గా కొత్త బాధ్యతలు అప్పగించబడినప్పటికీ, అదనపు కలెక్టర్లు వారి సాధారణ పరిపాలనా విధులను కూడా నిర్వహించవలసి ఉంటుంది. అదనపు కలెక్టర్లు జిల్లా కలెక్టర్‌కు ముఖ్య సహాయకులుగా ఉండి రెవెన్యూ కార్యకలాపాలు, భూముల కేటాయింపులు , పౌర సరఫరాలు, భూభారతి వంటి కీలక అంశాలను పర్యవేక్షిస్తారు. అదే విధంగా గ్రామ పంచాయతీలు , పురపాలక సంఘాల స్థానిక సంస్థల అభివృద్ధి ప్రణాళికలను పర్యవేక్షిస్తారు. పరిశుభ్రత, పచ్చదనం వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయడం, వాటిని సమర్థవంతంగా నిర్వహించడం కోసం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం వీరి ముఖ్య విధుల్లో భాగం. వీరు వివిధ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తారు. పరిపాలన క్రమంలో కలెక్టర్ (%జశీశ్రీశ్రీవషిశీతీ%), జాయింట్ కలెక్టర్ (ఇది రద్దైంది) తర్వాత వీరే(అదనపు కలెక్టర్) ముఖ్య స్థానంలో ఉంటారు.

# 2,863 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**


నెర వేరింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం షాపుల లైసెన్స్‌ల కేటాయింపు కోసం ఎక్సైజ్ శాఖ సెప్టెంబర్ 25న నోటిఫికేషన్ జారీ చేసింది. తదుపరి రోజు నుంచే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. క్రితం సారి 1.32 లక్షల దరఖాస్తుల ద్వారా దాదాపు రూ.2,645 కోట్ల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈసారి దరఖాస్తుల సంఖ్య కొంత తగ్గినప్పటికీ, రుసుము పెరగడం వల్ల ఆదాయం పెరిగింది. గతంలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు కాగా, ఈసారి రూ.3 లక్షలకు పెంచడం వల్ల ఆదాయం దాదాపు రూ.3 వేల కోట్లకు చేరుతుందని ప్రభుత్వం ముందుగానే అంచనా వేసింది. అక్టోబర్ 18 అర్ధరాత్రి వరకు 89,344 దరఖాస్తులు మాత్రమే రావడంతో.. గడువు పొడగించగా, ఆ గడువు గురువారంతో ముగిసింది.

# ఢిల్లీకి సీఎం రేవంత్

### నేడు ఏఐసీసీ కార్యాలయంలో ఖర్గేతో భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి శనివారం మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మల్లిఖార్జున్ ఖర్గే అధ్వర్యంలో జరిగే డీసీసీ అధ్యక్షుల నియామకం సమావేశానికి సీఎం హాజరుకానున్నారు. సీఎంతో పాటు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కూడా ఢిల్లీ వెళ్లనున్నారు. తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో డీసీసీ అధ్యక్షుల ఎంపికను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ మేరకు తెలంగాణకు 22 మంది పరిశీలకులను నియమించింది. ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఏఐసీసీ సీనియర్ నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించింది. ఈ నెల చివరి వరకు డీసీసీ అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించనుంది. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో డీసీసీకి ముగ్గురు పేర్లను పరిశీలనలోకి తీసుకున్నారు. రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ లు ఢిల్లీ పర్యటనలో రాష్ట్రంలో మంత్రులు, నేతల మధ్య వివాదాలు, బీసీ రిజర్వేషన్లపై హైకమాండ్ పెద్దలతో చర్చించనున్నట్లుగా సమాచారం. అలాగే రేవంత్ రెడ్డి రోజుల పాటు ఢిల్లీలో ఉండనున్నందునా.. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉంది.

# జిమ్‌లలో బాడీ ఇంజెక్షన్లు!



**కండలు పెంచేలా స్టెరాయిడ్స్**

**డ్రగ్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ**

హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని పలు జిమ్‌లలో ప్రాణాంతక ఇంజెక్షన్లను అక్రమంగా నిల్వ చేస్తున్నారనే సమాచారంతో తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కండలు పెరుగుతాయని పలు జిమ్‌ల యజమానులు అనబాలిక్–ఆండ్రోజెనిక్ స్టెరాయిడ్స్, కార్డియాక్ అరెస్టులకు దారి తీసే మెఫెంటెర్మిన్ సల్ఫేట్‌ను జిమ్‌కు వచ్చే వారికి సూచిస్తున్నారు. అయితే ఇవి ప్రాణాంతక ఇంజెక్షన్లని అధికారులు గుర్తించారు. అక్రమంగా నిల్వ చేసిన ఈ ప్రాణాంతక ఇంజెక్షన్ల కోసం నగరంలోని పలు జిమ్‌లలో అధికారులు సోదాలు నిర్వహించారు. దేహదారుఢ్యం కోసం అనబాలిక్–ఆండ్రోజెనిక్ స్టెరాయిడ్స్, మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు వంటివి ఉపయోగిస్తే హృదయ సంబంధిత రుగ్మతలకు దారి తీస్తుందని, కొన్నిసార్లు మరణానికి కూడా కారణం కావచ్చని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, స్థానిక పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని హైదరాబాద్ నగరంలోని 20 జిమ్‌లలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అకస్మిక తనిఖీలు నిర్వహించింది. సికింద్రాబాద్, మెహదీపట్నం, టోలీచౌకి, మలక్‌పేట, నార్సింగి, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొత్తపేట, కూకట్‌పల్లి, సూరారంలలోని జిమ్‌లలో తనిఖీలు నిర్వహించినట్లు డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం తెలిపారు. గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేసే సమయంలో అనస్థిషియా ఇవ్వడం వల్ల రోగులకు రక్తపోటు తగ్గుతుంది. ఆ సమయంలో బీపీని పెంచడానికి మెఫెంటెర్మిన్ సల్ఫేట్‌ను వినియోగిస్తారు. ఈ ఔషధం ఎంత మోతాదులో ఉండాలనేది కేవలం వైద్యుడు మాత్రమే నిర్ణయించాలి. అయితే జిమ్ నిర్వాహకులు దీనిని దుర్వినియోగం చేస్తూ, అక్కడకు వచ్చే వారికి సూచిస్తున్నారు.

## వెయ్యి ఎకరాలు కాపాడాం

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

ప్రజల్లో అవగాహనతోనే మార్పు సాధ్యమని వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): ప్రజల్లో సరైన అవగాహన కల్పించినప్పుడే ఎలాంటి మార్పు అయినా సాధ్యమవుతుందని, ఆ దిశగా తాము విజయం సాధించామని హైడ్రా (హైదరాబాద్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ అండ్ రీజనరేషన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఒకప్పుడు హైడ్రా ఎందుకు ఏర్పాటైంది, దాని లక్ష్యాలు ఏమిటి అనే విషయాలపై స్పష్టత ఉండేది కాదని, కానీ ఇప్పుడు చిన్న పిల్లలకు కూడా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గురించి వివరించేంత చైతన్యం వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలు అర్థం చేసుకున్నప్పుడే వ్యవస్థలు విజయవంతంగా పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ కల్చర్ అండ్ డిప్లమాటిక్ రిలేషన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ పార్క్ హోటల్‌లో "మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణల అవసరం" అనే అంశంపై ఒక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగనాథ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగానే హైడ్రా పనిచేస్తోందని తెలిపారు. సాంస్కృతిక, పర్యావరణ పరిరక్షణకు ఐరాస ఎలా ప్రాధాన్యత ఇస్తుందో, అదే స్ఫూర్తితో నగరంలో మెరుగైన జీవన ప్రమాణాల కోసం చెరువులు, నాలాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని వివరించారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినా నగరాన్ని వరదల నుంచి కాపాడగలిగామని రంగనాథ్ తెలిపారు. చెరువులు, వాటిని అనుసంధానించే నాలాలను కాపాడుకోకపోతే నగరాలు నీట మునగడం ఖాయమని హెచ్చరించారు. ప్యాట్నీ నాలాను విస్తరించి, పూడిక తొలగించడం ద్వారా దాదాపు 7 కాలనీలకు వరద ముప్పు తప్పించామని గుర్తుచేశారు. ఒకప్పుడు ఆక్రమణలతో ఆనవాళ్లు కోల్పోయిన బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని, త్వరలోనే మరో 5 చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

## రేవంత్ జీహెచ్‌ఎంసీ పార్కుల ఆకస్మిక తనిఖీ

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): జీహెచ్‌ఎంసీ పార్కుల పనులను సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. గతంలో చెత్తాచెదారంతో నిండి ఉన్న ప్రభుత్వ స్థలంలో, కబ్జాలకు గురికాకుండా పార్కు నిర్మాణం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో నిర్మాణంలో ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కు పనులను పరిశీలించారు. బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి కూమారుడి వివాహానికి హాజరై తిరిగివస్తున్న క్రమంలో పార్కు వద్ద ఆగి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మక్కన్ సింగ్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. నగరంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతున్న క్రమంలో ఇదే నియోజకవర్గంలోని పార్కులను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. నియోజవర్గంలో ప్రభుత్వ పరంగా చేయాల్సిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచినట్లు తెలుస్తుంది. ఈ సారి జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎలాగైనా గెలవాలని చూస్తుంది.

## తమిళనాడులోనూ 'సర్'

**హైకోర్టుకు తెలిపిన ఈసీ**

బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రాజకీయంగా తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. 'సర్'కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఎస్ఐఆర్ పేరుతో బీహార్‌లో పెద్ద ఎత్తున ఎన్నికల రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపించాయి. అయితే, ప్రతిపక్షాల ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడడమే సర్ ప్రాథమిక లక్ష్యమని ఈసీ పేర్కొంటున్నది. అంతేకాదు, దశలవారీగా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు ఇటీవలే ఈసీ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే తమిళనాడులోనూ 'సర్' నిర్వహించనున్నట్లు ఈసీ తాజాగా తెలిపింది. ఒక వారం రోజుల్లో రాష్ట్రంలో ఇది ప్రారంభం అవుతుందని శుక్రవారం మద్రాస్ హైకోర్టుకు తెలిపింది. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ శాసనసభలకు 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## బస్సు ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ

**కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ డిమాండ్**

బెంగళూరు: కర్నూలు సమీపంలో జరిగిన ఘోర బస్సు అగ్నిప్రమాదంపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. 19 మంది ప్రయాణికులు సజీవదహనమైన ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దీని వెనుక కుట్ర లేదా నిర్లక్ష్యం ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బెంగళూరులోని విధానసౌధలో విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్, ఈ ఘటనపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "గతవారం కూడా బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే దగ్ధమైంది. నేను ఇటీవల రాయచూర్‌కు వెళ్లినప్పుడు, అక్కడి ప్రజలు నాకు ఆ వీడియో చూపించారు. ఆ బస్సులో మంటలు రాగానే మా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఒకరు డ్రైవర్‌ను పట్టుకుని గట్టిగా అరిచి హెచ్చరించడంతో ప్రయాణికులందరూ వెంటనే కిందికి దిగిపోయారు. ఆ బస్సులో సుమారు 20 మంది వైద్య విద్యార్థులు ఉన్నారు. అదృష్టవశాత్తు, స్వల్ప గాయాలతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. వారి ల్యాప్‌టాప్‌లు మాత్రం కాలిపోయాయి" అని ఆయన గుర్తుచేశారు. అంత పెద్ద ఘటన జరిగినా అధికారులు ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోలేదని, పోలీసులు కూడా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. తాజా ప్రమాదానికి గురైన బస్సు ఆపరేటర్ బెంగళూరుకు చెందిన వ్యక్తి కావడంతో, ఈ విషయంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి, హోం మంత్రి జి.పరమేశ్వరను ఆదేశించినట్లు శివకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తాజా దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



**ప్రమాదస్థలి వద్దే డీఎన్ఏ, పోస్టుమార్టం టెస్టులు**


కర్నూలు సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో జరిగిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో సుమారు 20 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతుండగా, మృతదేహాలను వెలికితీశారు. అయితే, మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో, ఘటనా స్థలంలోనే వైద్య బృందాలు పోస్టుమార్టంతో పాటు డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలను సేకరిస్తున్నాయి. డీఎన్ఏ రిపోర్టులు వచ్చిన తర్వాత, వాటి ఆధారంగా మృతులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు బంధువులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. మరోవైపు, ఈ ప్రమాదంలో గాయపడిన వారి గురించి కూడా సూపరింటెండెంట్ వివరాలు తెలిపారు. మొత్తం 12 మందికి ఆసుపత్రిలో వైద్యం అందించగా, స్వల్ప గాయాలైన 8 మందికి ప్రథమ చికిత్స చేసి డిశ్చార్జి చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరిలో ఒకరికి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, మిగిలిన ముగ్గురి పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆయన వివరించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

**హైదరాబాద్‌లో వేమూరి కావేరి ఆఫీసులు క్లోజ్**

ఘోర ప్రమాదం నేపథ్యంలో వి కావేరి ట్రావెల్స్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని తమ కార్యాలయాలన్నింటినీ మూసివేసింది. ఘటన జరిగినప్పటి నుంచి యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

## పాఠాలు వింటూనే చిన్నారి బ్రెయిన్ డెడ్

**హనుమకొండలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విషాద ఘటన**



హనుమకొండ, అక్టోబర్ 24 (ఈవార్తలు): చదువుల ఒడిలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. పాఠం వింటున్న ఓ తొమ్మిదేళ్ల విద్యార్థి ఉన్నట్టుండి తరగతి గదిలోనే కుప్పకూలిపోయాడు. వైద్యులు ఆ చిన్నారి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించడంతో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఈ హృదయ విదారక ఘటన జరిగింది. బానోతు సుదీష్ ప్రేమ్ కుమార్ (9) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. రోజూలాగే గురువారం పాఠశాలకు వెళ్లిన ఆ చిన్నారి, తరగతి గదిలో పాఠం వింటుండగా అకస్మాత్తుగా బెంచీపై తల వాల్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు, యాజమాన్యం బాలుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు, బాలుడు బ్రెయిన్ డెడ్ అయినట్లు తేల్చారు. గుండె కొట్టుకుంటుండటంతో ప్రస్తుతం అతడిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఉదయం ఆరోగ్యంగా పాఠశాలకు పంపిన తమ కుమారుడు ఇలాంటి స్థితికి చేరుకోవడాన్ని ప్రభుత్వ ఉద్యోగులైన తల్లిదండ్రులు రమేశ్, సుజాత జీర్ణించుకోలేకపోతున్నారు. పాఠశాల యాజమాన్యం సరైన సమయంలో స్పందించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని వారు కన్నీరుమున్నీరయ్యారు. తీవ్రమైన తలనొప్పి వచ్చినప్పుడు శ్వాస సరిగా అందకపోవడం వల్ల ఇలా జరిగి ఉండవచ్చని వైద్యులు తమకు వివరించినట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పాఠశాల వద్దకు చేరుకుని యాజమాన్యం నిర్లక్ష్యంపై ఆందోళనకు దిగాయి. నెలన్నర క్రితం ఇదే పాఠశాలలో మరో విద్యార్థి మరణించాడని, వరుస ఘటనలు జరుగుతున్నా యాజమాన్యం భద్రతా చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి పాఠశాలను సందర్శించి ప్రాథమిక విచారణ చేపట్టారు. పాఠశాలలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి, ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

## జీవితాంతం కేసీఆర్‌తోనే: శ్రీనివాస్ గౌడ్




హైదరాబాద్, అక్టోబర్ 24 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి భయంతో దిగజారి నీతిమాలిన రాజకీయాలు చేస్తోంది అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అభ్యర్థి నాతో ఎప్పుడు ఫోటో దిగారో, ఎప్పుడు మాట్లాడారో తనకు తెలియదన్నారు. నా జీవితాంతం కేసీఆర్‌తోనే ఉంటానని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. నవీన్ యాదవ్‌కు శ్రీనివాస్ గౌడ్ మద్దతు తెలిపారని సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. ఫాల్త్ మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నేను ఉద్యమ సమయం నుంచి కేసీఆర్‌తో ఉన్నాను. నా తండ్రి తెలంగాణ ఉద్యమకారుడు. తెలంగాణ కోసం ఉద్యోగాన్ని వదులుకుని వచ్చాను. ఉద్యోగంలో ఉండి జైలుకి వెళ్లాను. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నా తమ్ముడిని 40 రోజులు జైల్లో పెట్టారు. నేను ఒకే పార్టీలో ఉన్నాను, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశాను. నా క్యారెక్టర్‌ను దెబ్బతీస్తున్నారు. గెలవడం చేతకాక క్యారెక్టర్ దెబ్బతీస్తున్నారు అని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. ఫేక్ ప్రచారాలు చేస్తున్న వారిపై మేము అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా చర్యలు తీసుకుంటాము. నాపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేస్తాం. వారిపై రూ. 10 కోట్లకు పరువు నష్టం దావా వేస్తాం. ఏ బుక్ లేదన్న డీజీపీ ఎందుకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. కాంగ్రెస్ వాళ్ళను మాత్రమే డీజీపీ కాపాడుతారా..? అని శ్రీనివాస్ గౌడ్ నిలదీశారు. సెటిల్‌మెంట్లు చేసిన వాళ్ళను, రేప్ కేసులో ఉన్న వాళ్ళను వెంట తిప్పుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటు. కేసీఆర్ చేసినట్లు బీసీలకు ఎవరూ మేలు చేయలేదు. మీలాగా మేము చెట్టు కొమ్మను నరుక్కోం. కాంగ్రెస్ అఫీషియల్ ఫేస్‌బుక్‌లో నాపై పోస్టు పెట్టారు మీకు సిగ్గు ఉందా..? ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాను జీవితాలతో ఆటలు ఆడవద్దు. మా కుటుంబ సభ్యులను వేధించినా మేము భయపడలేదు. పార్టీ మారితే కేసులు ఎత్తివేస్తామన్నా పార్టీ మారలేదు అని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



## పవన్‌తో రంగనాథ్ భేటీ

**దాదాపు రెండు గంటల పాటు సమావేశం**

మంగళగిరి, అక్టోబర్ 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ సమావేశమయ్యారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్‌లో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణకు హైడ్రా కృషి చేస్తోన్న విషయం తెలిసిందే. హైడ్రా హైదరాబాద్ నగరంలో కోట్లాది రూపాయల విలువ చేసే భూములను పరిరక్షించింది. ఈ నేపథ్యంలో వీరి మధ్య రెండు గంటల పాటు సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. హైదరాబాద్ నగరంలో హైడ్రా పనితీరు తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే, ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగిందని పవన్ కల్యాణ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



## బస్సును లాగుతూ బోల్తాపడిన క్రేన్

కర్నూలు జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపిన కావేరి బస్సు ప్రమాద స్థలంలో మరో ఘటన చోటుచేసుకుంది. కాలిపోయిన బస్సును రోడ్డు పైనుంచి తొలగిస్తుండగా, దానిని లాగుతున్న క్రేన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో క్రేన్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, చిన్నటేకూరు వద్ద దగ్ధమైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సును రోడ్డు పక్కకు తరలించేందుకు అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బస్సును క్రేన్‌తో లాగుతుండగా, బరువు కారణంగా క్రేన్ ఒక్కసారిగా అదుపుతప్పింది. దీంతో రోడ్డు పక్కకు ఒరిగిపోయి బోల్తాపడింది. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్‌ను వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## వంగర గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

హనుమకొండ, అక్టోబర్ 24 (ఈవార్తలు): పదవ తరగతి చదువుతున్న వనం శ్రీవర్ష (14) అనే విద్యార్థిని ఎవరు లేని సమయంలో డార్మెంటరీ హాల్లో చున్నీతో ఉరివేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పీవీ రంగారావు తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. విద్యార్థుల కథనం మేరకు.. శ్రీ వర్ష సెలవులకు వెళ్లి గురువారమే పాఠశాలకు తిరిగి వచ్చింది. ఈరోజు ఉదయం ఉపాధ్యాయురాలి సెల్ నుండి ఆమె తల్లిదండ్రులకు కాల్ చేసింది. తనను వెంటనే తీసుకెళ్లాలని, ఇక్కడ ఉండనని మొరపెట్టుకుంది. దీంతో తల్లిదండ్రులు తీసుకెళ్లేందుకు పాఠశాలకు వస్తున్నామని బదులిచ్చారు. ప్రార్థన సమయం కావడంతో విద్యార్థులందరూ బయటకు రాగా శ్రీ వర్ష కనిపించలేదు. దీంతో డార్మెంటరీ హాల్ కి వెళ్లి చూడగా ఆమె చున్నీతో ఉరివేసుకొని విగత జీవిలా కనిపించింది. వెంటనే ఉపాధ్యాయులు ఆమె తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. శ్రీవర్ష స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్. కాగా సంఘటన స్థలాన్ని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐలు దివ్య, ప్రవీణ్ కుమార్ చేరుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సోషల్ వాణి




### శర్వానందేనా..?

షర్ట్‌లెస్ ఫొటోలతో శర్వానంద్ సోషల్‌మీడియాలో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యాడు. ఇప్పటివరకూ ఎప్పుడూ కనిపించని విధంగా సన్నగా దర్శనమిచ్చారు. ఆయన ఫొటోలను చూసి అటు అభిమానులు, ఇటు ప్రేక్షకులు ఆశ్చర్యపోతున్నారు. బైకర్ సినిమా కోసం నిజమైన రేసర్‌గా కనిపించేందుకు ఆయన బరువు తగ్గినట్లు తెలుస్తోంది. ఇందుకోసం కొన్ని నెలల పాటు వర్కవుట్స్, కఠినమైన ఆహార నియమాలు పాటించారట. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బైకర్‌లో శర్వాకు జోడీగా మాళవిక నాయర్ నటిస్తోంది.

# ప్రజల నమ్మకానికి ప్రతీక పోలీసులు

**మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మోటివేషనల్ సెషన్**



మేడ్చల్, అక్టోబర్ 24 (ఈవార్తలు): ప్రజల నమ్మకానికి పోలీసులు ప్రతీకలు అని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, రియల్‌వర్సిటీ వ్యవస్థాపకుడు ఉరుకుందు శెట్టి అన్నారు. గురువారం సాయంత్రం మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మోటివేషనల్, లైఫ్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉరుకుందు వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి కమ్యూనికేషన్, టీమ్‌వర్క్, లీడర్‌షిప్, ఎమ్పతీ, టైమ్ మేనేజ్‌మెంట్ వంటి నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. “పోలీస్ ఉద్యోగం కేవలం విధి నిర్వాహణ కాదు, అది సేవ, సమాజ భద్రత, ప్రజల నమ్మకానికి ప్రతీక అని అన్నారు. ఒక పోలీస్ అధికారి నైపుణ్యాలతో ఎదిగితే, సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్‌పి పి. మాధుకర్ స్వామి, డీఎస్పీ వెంకట విజయ్ కుమార్, సీఐ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోలీస్ ట్రైనీలు ఈ సెషన్ తమలో కొత్త ఉత్సాహం, ఆత్మవిశ్వాసం కలిగించిందని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన నిఖిల్ గుండాకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎస్ఎం విద్యార్థులు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 24 (ఈవార్తలు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలలో జగిత్యాలకు చెందిన గోపు మణిదీప్ రెడ్డి బిడిగే అభిరామ్, మోక్షప్రద రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో అత్యంత ప్రతిభ కనబరచి నవంబర్‌లో ఖమ్మంలో జరిగే పోటీలకు వీరు ఎంపికయ్యారు. అంతేకాకుండా జోనల్ స్థాయిలోనే జగిత్యాల జిల్లా ఓవరాల్ సెకండ్ ఛాంపియన్‌గా నిలిచి జగిత్యాల జిల్లా ప్రజలు గర్వపడేలా చేశారని ఎస్ఎం అకాడమీ జనరల్ సెక్రటరీ, కోచ్ పోడేటి శ్రీకాంత్ అన్నారు. విద్యార్థులను జగిత్యాల జిల్లా ఎస్ఎం టేబుల్ టెన్నిస్ అకాడమీ సభ్యులు అభినందించారు.



# స్వర్ణముఖి నదిలో నలుగురు బాలురు గల్లంతు

తిరుపతి, అక్టోబర్ 24 (ఈవార్తలు): తిరుపతి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లిన నలుగురు బాలురు గల్లంతయ్యారు. ఈ దుర్ఘటనపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాలింపు చర్యల్లో ఇప్పటికే ఇద్దరు బాలుర మృతదేహాలు లభ్యమవ్వగా, మరో ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతోంది. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం సమీపంలో ఈ ఘటన జరిగింది. మొత్తం ఏడుగురు బాలురు స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లగా, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నలుగురు గల్లంతయ్యారు. ఈ ఘటనపై హోంమంత్రి అనిత స్పందిస్తూ, విషయం తెలిసిన వెంటనే తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడుతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని, డ్రోన్ల సహాయంతో ఇద్దరి మృతదేహాలను గుర్తించి వెలికితీశామని వివరించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇదే సమయంలో, గల్లంతైన వారితో పాటు నదిలోకి వెళ్లిన మరో ముగ్గురు చిన్నారులను స్థానిక ప్రజలు సకాలంలో కాపాడడంతో వారు సురక్షితంగా బయటపడ్డారని హోంమంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు, చెరువులు, కాలువల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉందని అనిత గుర్తుచేశారు. ప్రజలు, ముఖ్యంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నీటి వనరుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఆరుగురి ప్రాణాలు కాపాడిన రియల్ హీరో

కర్నూలు, అక్టోబర్ 24 (ఈవార్తలు): కర్నూలు బస్సు ప్రమాదంలో.. రమేష్ అనే వ్యక్తి తన తోటి ఆరుగురు ప్రయాణికుల్ని ప్రాణాలకు తెగించి కాపాడాడు. ప్రమాద సమయంలో బస్సులో మంటలు చెలరేగి, చుట్టూ వ్యాపించాయి. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా హాహాకారాలు చేస్తూ బస్సులో చిక్కుకుపోయారు. బయట నుంచి సహాయం అందించేందుకు వీలుకాలేదు. అప్పుడే నేనున్నాంటూ బస్సులో రమేష్ అనే ప్రయాణికుడు ప్రాణాలకు తెగించాడు. బస్సు అద్దం పగలగొట్టి తనతో పాటు మరో ఆరుగురిని బయటకు రప్పించాడు. ‘ఆ సమయంలో నేను హిందూపురం నుంచి నంద్యాలకు నా కారులో వెళ్తున్నా. అద్దలు పగలగొట్టుకుని బయటకు వస్తున్న ఆరుగురు ప్రయాణికుల్ని నా కారులో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించా. మంటలు వ్యాపిస్తుంటే బస్సు లోపల రమేష్ అనే వ్యక్తి అద్దాలు పగలగొట్టి ప్రయాణికుల ప్రాణాల్ని కాపాడారు. ఆస్పత్రికి చికిత్స పొందుతున్న రమేష్‌తో పాటు మిగిలిన ప్రయాణికులు క్షేమంగా ఉన్నారు. లోపలి నుంచి బయటకు వచ్చేందుకు.. బయట నుంచి బస్సు లోపలికి వెళ్లి ప్రయాణికుల్ని కాపాడేందుకు వీలు లేదు’ అని ఓ వ్యక్తి పేర్కొన్నారు.

# వేగంగా భూభారతి పరిష్కారాలు

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు.. కథలాపూర్ ఎమ్మార్వో ఆఫీస్ ఆకస్మిక తనిఖీ**

కథలాపూర్, అక్టోబర్ 24 (ఈవార్తలు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా, వెంటవెంటనే అర్జీలను పరిష్కరించాలని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి,రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంట వెంటనే నోటీసులు జారీ చేస్తూ, క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన జరపాలని ఆదేశించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సకాలంలో సర్టిఫికెట్లు ప్రజలకు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి ఉన్నారు.



**జిల్లా పరిషత్ పాఠశాల ఆకస్మిక తనిఖీ**

కథలాపూర్ పర్యటనలో భాగంగా కలెక్టర్ స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాలను కూడా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యల పట్ల శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భోజనం నిర్వహణను, వంట సరుకుల నాణ్యతను, స్టోర్ రూమ్ లో గల బియ్యం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ వెంట కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జీవాకర్ రెడ్డి, డీఈవో రాము, తహసీల్దార్ వినోద్ కుమార్, ఎంపీడీవో శంకర్, ఎంఈఓ, అధికారులు పాల్గొన్నారు.

# ఏపీకి తుపాను ముప్పు

**అధికారులను అప్రమత్తం చేసిన ఏపీ సర్కారు**

వైజాగ్, అక్టోబర్ 24 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 48 గంటల్లో తుపానుగా బలపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఈడీ దీపక్ తో పాటు ఇతర కీలక అధికారులు పాల్గొన్నారు. తుపాను సన్నద్ధత, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై హోంమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ప్రస్తుత పరిస్థితిని హోంమంత్రికి వివరించారు. నైరుతి, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం సోమవారానికి తుపానుగా బలపడే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో శనివారం భారీ వర్షాలు, ఆదివారం అతి భారీ వర్షాలు, సోమ, మంగళవారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో తుపాను తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రభావితమయ్యే జిల్లాల యంత్రాంగాన్ని తక్షణమే అప్రమత్తం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. “తుపాను కారణంగా ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడటమే మన ప్రథమ కర్తవ్యం. ఇందుకోసం ముందస్తు సహాయక చర్యలను పటిష్టంగా అమలు చేయాలి” అని హోంమంత్రి స్పష్టం చేశారు. సహాయక చర్యల నిమిత్తం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరమైన ప్రాంతాలకు వెంటనే తరలించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో 24/7 పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు, అధికారులకు చేరవేయాలని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అక్కడ నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని హోంమంత్రి ఆదేశించారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, బాధితులకు నాణ్యమైన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తుపాను అనంతరం విరిగిన చెట్లను తొలగించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో చెట్లు, హోర్డింగుల కింద నిలబడరాదని, భారీ వర్షాల సమయంలో వీలైనంత వరకు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు కూడా హోంమంత్రి పలు సూచనలు చేశారు. సోషల్ మీడియాలో వ్యాపించే వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని కోరారు.



# పోలీస్ అమరులను స్మరిస్తూ రక్తదాన శిబిరం

కోరుట్ల, అక్టోబర్ 24 (ఈవార్తలు): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేళ.. కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని మెట్‌పల్లి డీఎస్పీ రాములు ప్రారంభించారు. శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాన చేసిన వారికి డీఎస్పీ పండ్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరులను స్మరిస్తూ రక్త దానం చేసేందుకు ముందుకు వచ్చిన అందరికీ అభినందనలు తెలియజేశారు. శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను స్మరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా తాజాగా శరీరంలోకి కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి, ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. ఈ రక్తదాన శిబిరాలలో సేకరించిన 100 యూనిట్ల రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేశ్, ఎస్సైలు చిరంజీవి, శ్రీధర్ రెడ్డి, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ మంచాల కృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యల పరిష్కారానికి అమృత్ 2.0

జగిత్యాల టౌన్, అక్టోబర్ 24 (ఈవార్తలు): తెలంగాణలో నీటి సరఫరా, మురుగునీటి మెరుగుపరిచడానికి అమృత్ 2.0 పథకం తీసుకొచ్చినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బీ రాజా గౌడ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికి నల్లా ద్వారా నిరంతరాయంగా నీటి సరఫరాను అందించాలని, మురుగునీటి శుద్ధి, పారుదల వ్యవస్థలను మెరుగుపర్చి పట్టణ జీవన ప్రమాణాలను పెంపొందించాలని అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలోని చెరువులు, నాళాలను సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.



# తేనెటీగల దాడి.. 15 మంది కూలీలకు గాయాలు

కోనరారావుపేట, అక్టోబర్ 24 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన దాదాపు 15 మంది పత్తి కూలీలపై తేనెటీగలు ఒకేసారి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన కనగర్తి సుద్దాల మధ్య జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 15 మంది కూలీలు ఉదయం పత్తి చేనులో పని చేస్తుండగా, సమీపంలోని తేనెపట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగల గుంపు వారిపై దాడి చేసింది. తేనెటీగల దాడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలు భయంతో పరుగులు తీశారు. దాడిలో పలువురు కూలీలు స్పృహ కోల్పోయారు. మరికొందరు తేనెటీగల కుట్టడంతో నొప్పితో రోదిస్తూ కనిపించారు. కూలీల ఆర్తనాదాలు విన్న స్థానికులు, చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించారు.

# నిండు గర్భిణీకి రక్తదానం

**మానవత్వం చాటిన అక్బర్ హుస్సేన్**



జగిత్యాల టౌన్, అక్టోబర్ 24 (ఈవార్తలు): జగిత్యాల మాతాశిశు హాస్పిటల్‌లో గర్భిణీకి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడో వ్యక్తి. డెలివరీ నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన అనూష-జగదేవపేట్‌కు అత్యవసర%శీ%గా బీ పాజిటివ్ రక్తం అవసరమైంది. చింత సుధీర్ అందించిన సమాచారంతో ధరూర్ క్యాంప్‌నకు చెందిన అక్బర్ హుస్సేన్ హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి రక్తన్ని దానం చేసి.. తల్లీ బిడ్డ ప్రాణాలను కాపాడాడు. అతడికి అనూష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# బస్సు ప్రమాదంపై జగన్ సంతాపం

అమరావతి : కర్నూలు ఘోర బస్సు ప్రమాదంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతో కలిచి వేసిందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో 19 మంది సజీవ దహనం అత్యంత విషాదకరమని అన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందేలా చూడాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

# ప్రమాదంపై పవన్ దిగ్భ్రాంతి

బస్సు దుర్ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# తిరుగులేని శక్తిగా తెలుగు జాతి

**దుబాయ్‌లో ఏపీ సీఎం చంద్రబాబు**

అమరావతి/దుబాయ్, అక్టోబర్ 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన మూడు రోజుల యూఏఈ పర్యటన (అక్టోబర్ 22-24) ముగింపు సందర్భంగా దుబాయ్‌లోని లె మెరిడియన్ హోటల్‌లో జరిగిన ‘తెలుగు డయాస్పోరా’ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులనుద్దేశించి ప్రసంగించారు. యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఒమన్, బహ్రెయిన్, ఖతార్ వంటి ఆరు గల్ఫ్ దేశాల నుంచి వేలాది మంది తెలుగువారు ఈ కార్యక్రమానికి హాజరు కావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు జాతి తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని, ప్రపంచంలోనే నంబర్ వన్‌గా తయారవుతుందని ఆయన ఉద్ఘాటించారు. తెలుగువారు ఎక్కడికి వెళ్లినా అత్యున్నత స్థాయిలను చేరుకుంటారని, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల లాంటి నాయకులు ప్రపంచవ్యాప్తంగా ఐటీ నిపుణులుగా రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఏపీ ఎన్ఆర్ఐ చైర్మన్ వేమూరి రవి పాల్గొన్నారు. ఏపీలో పెట్టుబడులు, సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను తీసుకువచ్చినట్లుగా, ఇప్పుడు విశాఖపట్నంకు గూగుల్‌ను తీసుకువస్తున్నామని ప్రకటించారు. ముఖ్యంగా, క్వాంటం వ్యాలీకి దేశంలో ఆంధ్రప్రదేశే ఏకైక ప్రాంతమని తెలిపారు. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో గూగుల్ విశాఖలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. పాలనలో సాంకేతికత వినియోగంపై మాట్లాడుతూ, వాట్సాప్ ద్వారా 730 పౌర సేవలను అందిస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో వేగాన్ని ప్రదర్శించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పారు.



# పసిడి పరుగుకు బ్రేక్

## తొమ్మిది వారాల ర్యాలీ స్టాప్.. ధరలు మరింత తగ్గే అవకాశం



ముంబై: గత తొమ్మిది వారాలుగా నిర్విరామంగా కొనసాగిన బంగారం జైత్రయాత్రకు అనూహ్యంగా బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర ఏకంగా 3 శాతం పతనమైంది. మే నెల తర్వాత ఒక వారంలో ఈ స్థాయిలో ధర తగ్గడం ఇదే తొలిసారి. ఈ ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,118.68 డాలర్లకు చేరింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి దాదాపు 50 శాతానికి పైగా లాభపడిన తర్వాత వచ్చిన ఈ సర్దుబాటు, ప్రధానంగా సాంకేతిక కారణాలతో పాటు ఇతర అంశాల వల్లే జరిగిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశీయ మార్కెట్లోనూ బంగారం ధరలు భారీగా తగ్గాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 1 శాతం తగ్గి 10 గ్రాముల ధర రూ.1,23,222కి పడిపోయింది. బంగారంతో పాటు వెండి కూడా అదే బాట పట్టింది. కిలో వెండి ధర 1.5 శాతం తగ్గి రూ.1,46,365కు చేరింది. వారంలో బంగారం 5 శాతానికి పైగా నష్టపోవడం గత ఐదేళ్లలో ఇదే అత్యంత తీవ్రమైన పతనం. మరోవైపు, బంగారం ఆధారిత ఈటీఎఫ్‌ల నుంచి భారీగా పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. రికార్డు స్థాయి ధరల వద్ద సంస్థాగత మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమే దీనికి కారణమని స్పష్టమవుతోంది.

**పతనానికి ప్రధాన కారణాలివే...**

1. లాభాల స్వీకరణ: ఈ ఏడాది బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో, భారీ లాభాలు ఆర్జించిన సంస్థాగత పెట్టుబడిదారులు వాటిని సొమ్ము చేసుకుంటున్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ఇదే విషయాన్ని సూచిస్తోంది.

2. డాలర్ బలపడటం: గత మూడు సెషన్లుగా అమెరికా డాలర్ ఇండెక్స్ బలపడుతోంది. డాలర్ విలువ పెరిగితే, ఇతర కరెన్సీలలో బంగారం కొనడం ఖరీదుగా మారుతుంది. ఫలితంగా పసిడికి ఆకర్షణ తగ్గి డిమాండ్ పడిపోతుంది.

3. అమెరికా-చైనా వాణిజ్య చర్చలపై ఆశలు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరగవచ్చనే సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గితే, సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఉండే డిమాండ్ సహజంగానే తగ్గుతుంది.



## నష్టాలతో ముగిసిన
# వారాంతపు ట్రేడింగ్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆరు రోజులుగా కొనసాగుతున్న లాభాల జోరుకు శుక్రవారం బ్రేక్ పడింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఒప్పందంపై కొత్తగా సమీక్ష జరగవచ్చున్న వార్తల నేపథ్యంలో అంతర్జాతీయంగా సెంటిమెంట్ బలహీనపడింది. దీంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 344.52 పాయింట్లు నష్టపోయి 84,211.88 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 96.25 పాయింట్లు క్షీణించి 25,795.15 వద్ద ముగిసింది. "సెషన్ ఆద్యంతం నిఫ్టీ బలహీనంగానే కదలాడింది. ట్రేడర్లు లాభాలను బుక్ చేసుకోవడంతో కీలకమైన 25,850 మద్దతు స్థాయిని కోల్పోయి, 25,700 స్థాయికి పడిపోయింది" అని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. "రాబోయే 1-2 సెషన్లలో ఒడిదుడుకులు కొనసాగినా, ఆ తర్వాత మళ్లీ ర్యాలీ కనిపించే అవకాశం ఉంది. నిఫ్టీకి 25,850 వద్ద నిరోధం ఉంది. దాన్ని దాటితే 26,000-26,200 స్థాయిలకు చేరవచ్చు" అని వారు అంచనా వేశారు. సెన్సెక్స్ సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్ కంపెనీల షేర్లు ప్రధానంగా నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, సన్ ఫార్మా షేర్లు లాభపడి సూచీలకు కొంత మద్దతునిచ్చాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ సూచీ 1.03 శాతం, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 0.2 శాతం మేర లాభపడ్డాయి. అయితే, ఎఫ్ఎంసీజీ రంగం షేర్లలో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీ 0.75 శాతంతో అత్యధికంగా నష్టపోయింది. పీఎస్‌యూ బ్యాంక్ సూచీ కూడా 0.74 శాతం మేర పతనమైంది. బ్రాడర్ మార్కెట్‌లోనూ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, రష్యాపై ఆంక్షల నేపథ్యంలో పెరుగుతున్న ముడిచమురు ధరల వంటి అంశాలు ఇన్వెస్టర్లను ఆచితూచి వ్యవహరించేలా చేశాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# ఐరాస పనికిరాదు

**ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేదు**

**కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్**

**స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు యూఎన్ సూచన**

**తీవ్రంగా స్పందించిన జైశంకర్**



న్యూఢిల్లీ: మైనారిటీల రక్షణ, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులను కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గట్టిగా స్పందించారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు. ఐరాస 80వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపు విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివాదాల యుగంలో శాంతి అవశ్యమని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఐక్యరాజ్య సమితిలో అంతా సరిగా లేదని అన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితిలో మార్పులు జరిగేలా సంస్కరణలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితికి భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని, అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. జాత్యాహంకారం, వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను స్విట్జర్లాండ్ ఎదుర్కొంటున్న సంగతిని ఆయన ప్రస్తావించారు.





## మోదీ వీరాభిమాని..
## 160 సభలకు హాజరు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తనకున్న అపారమైన అభిమానాన్ని చాటుకుంటూ ఓ యువకుడు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. బీహార్‌లోని బేగూసరాయ్‌కు చెందిన శ్రవణ్ షా అనే ఈ వీరాభిమాని, మోదీ హాజరయ్యే సభలకు హనుమంతుని వేషధారణలో వెళుతుంటాడు. తాజాగా ప్రధాని మోదీ పాల్గొన్న 160వ ర్యాలీకి కూడా హాజరై తన భక్తిని చాటుకున్నాడు. శ్రవణ్ షా కాషాయ వస్త్రాలు ధరించి, తలపై బీజేపీ గుర్తు అయిన కమలం ఆకారంలో ఉన్న టోపీ పెట్టుకుని, ఒక చేతిలో 'నమో బీజేపీ' అని రాసి ఉన్న గదను, మరో చేతిలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కలిసి ఉన్న ఫొటోలతో కూడిన బ్యానర్‌ను పట్టుకుని ర్యాలీలలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. బీహార్‌లో జరిగే బహిరంగ సభల్లో అతడు సుపరిచితమైన ముఖంగా మారిపోయాడు. ఈ సందర్భంగా ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ శ్రవణ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "ఇది నేను హాజరవుతున్న ప్రధాని మోదీ 160వ సభ. ఆయన కోసం నేను దేశమంతా చెప్పులు లేకుండా నడుస్తాను. పేదలు, మహిళలతో సహా అందరి కోసం ప్రధాని ఎంతో చేశారు. ఒక పేద కుటుంబంలో పుట్టిన తొలి ప్రధాని ఆయనే. అందుకే ఆయనకు సామాన్యుల కష్టాలు బాగా తెలుసు" అని వివరించాడు. కేవలం మోదీనే కాకుండా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కూడా శ్రవణ్ ప్రశంసలతో ముంచెత్తాడు. "నితీశ్ కుమార్ అధికారంలోకి వచ్చినప్పుడు బీహార్ పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. కానీ ఇప్పుడు అన్నీ మారిపోయాయి. మోదీ, నితీశ్ కలిసి రాష్ట్రాన్ని పూర్తిగా మార్చేశారు. ఈసారి కూడా ఎన్డీఏ కూటమి భారీ మెజార్టీతో గెలుస్తుంది. నితీశ్ కుమార్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ముందుగానే శుభాకాంక్షలు చెబుతున్నాను" అని ధీమా వ్యక్తం చేశాడు.

# పాక్‌కు అఫ్ఘన్ షాక్

**నీళ్లు బంద్ చేయనున్న తాలిబన్ సర్కారు**



కాబూల్: ఇప్పటికే భారత్‌తో జల వివాదాలతో సతమతమవుతున్న పొరుగు దేశం పాకిస్థాన్‌కు తాలిబన్ల పాలనలోని ఆఫ్ఘనిస్థాన్ గట్టి షాక్ ఇచ్చింది. పాకిస్థాన్‌కు ప్రవహించే కీలకమైన కునార్ నదిపై భారీ డ్యామ్‌ను నిర్మించి, నీటి ప్రవాహాన్ని నియంత్రించాలని నిర్ణయించింది. ఈ మేరకు డ్యామ్ నిర్మాణ పనులను వీలైనంత వేగంగా ప్రారంభించాలని తాలిబన్ సుప్రీం లీడర్ మౌల్వీ హిబతుల్లా అఖుంద్జాదా జల, ఇంధన మంత్రిత్వ శాఖను ఆదేశించారు. ఇరు దేశాల మధ్య ఇటీవలే జరిగిన భీకర సరిహద్దు ఘర్షణల్లో వందలాది మంది మరణించిన కొన్ని వారాలకే అఫ్ఘనిస్థాన్ ఈ సంచలన నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఆఫ్ఘన్ జల, ఇంధన మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. విదేశీ సంస్థల కోసం ఎదురుచూడకుండా, దేశీయ కంపెనీలతోనే ఒప్పందాలు కుదుర్చుకోవాలని సుప్రీం లీడర్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు సమాచార శాఖ ఉప మంత్రి ముహాజెర్ ఫరాహీ ఎక్స్ వేదికగా తెలిపారు. "భారత్ తర్వాత, ఇప్పుడు పాకిస్థాన్‌కు నీటి సరఫరాను పరిమితం చేసే వంతు ఆఫ్ఘనిస్థాన్‌కు వచ్చినట్లుంది" అని లండన్‌కు చెందిన ఆఫ్ఘన్ జర్నలిస్ట్ సామి యూసఫ్‌జాయ్ వ్యాఖ్యానించారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వతాల్లో పుట్టే 480 కిలోమీటర్ల పొడవైన కునార్ నది, పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోకి ప్రవేశించి కాబూల్ నదిలో కలుస్తుంది. పాకిస్థాన్‌లో దీనిని చిత్రాల్ నది అని పిలుస్తారు. కాబూల్ నది ఆఫ్ఘన్-పాక్ మధ్య ప్రవహించే అతిపెద్ద నది. ఇది చివరకు అటోక్ వద్ద సింధు నదిలో కలుస్తుంది. కునార్ నదిపై డ్యామ్ నిర్మిస్తే, దాని ప్రభావం కాబూల్ నదిపై, ఆ తర్వాత సింధు నదిపై పడుతుంది. దీంతో పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాతో పాటు పంజాబ్ ప్రావిన్స్‌లో కూడా సాగునీరు, తాగునీటి అవసరాలకు తీవ్ర సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది.

# సిలికాన్ వ్యాలీలో సెక్స్ వార్‌ఫేర్

**మహిళా గూఢచారులపై ఎలాన్ మస్క్ వ్యంగ్య వ్యాఖ్య**

**ఆమె '10' అయితే, మీరు ఒక 'అసెట్' అంటూ వైరల్ ట్వీట్**

**చైనా, రష్యా గూఢచర్యం చేస్తున్నాయని సంచలన వ్యాఖ్యలు**

న్యూయార్క్: టెక్ బిలియనీర్, సోషల్ మీడియా సంచలనం ఎలాన్ మస్క్ మరోసారి తనదైన శైలిలో చేసిన ఒకే ఒక్క కామెంట్‌తో వార్తల్లో నిలిచారు. సిలికాన్ వ్యాలీలోని టెక్ రహస్యాలను తస్కరించడానికి మహిళా గూఢచారులు 'సెక్స్ వార్‌ఫేర్'కు పాల్పడుతున్నారంటూ వచ్చిన ఓ కథనంపై ఆయన స్పందించిన తీరు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. 'ది టైమ్స్' పత్రిక ఇటీవల ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం, చైనా, రష్యా వంటి దేశాలు అందమైన మహిళలను గూఢచారులుగా నియమించి సిలికాన్ వ్యాలీకి పంపుతున్నాయని ఆరోపించింది. అక్కడ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో పనిచేసే ఉన్నత స్థాయి నిపుణులను లక్ష్యంగా చేసుకుని, వారితో సంబంధాలు ఏర్పరచుకుని అత్యంత కీలకమైన సమాచారాన్ని దొంగిలిస్తున్నారని ఆ కథనం పేర్కొంది. ఈ పద్ధతిని 'సెక్స్ వార్‌ఫేర్'గా అభివర్ణించింది. కొందరు మహిళా గూఢచారులు తమ టార్గెట్‌లను పెళ్లి చేసుకోవడం, వారితో పిల్లల్ని కనడం ద్వారా దీర్ఘకాలిక సంబంధాలు నెరుపుతూ రహస్యాలను రాబడుతున్నారని వివరించింది. ఈ కథనం హెడ్‌లైన్‌ను గురువారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా షేర్ చేసిన ఎలాన్ మస్క్, దానికి తనదైన శైలిలో ఒక వ్యాఖ్యను జోడించారు. "ఆమెకు పదికి పది మార్కులు వేస్తే, ఇక మీరు ఒక ఆస్తి" అంటూ చమత్కరించారు.

## ఢిల్లీలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్ట్


న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో పోలీసులు భారీ ఉగ్రకుట్రను భగ్నం చేశారు. నగరంలో ఆత్మాహుతి దాడులకు కుట్ర పన్నిన ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు. నిఘా సంస్థల నుంచి అందిన పక్కా సమాచారంతో ఢిల్లీలోని సాదిక్‌నగర్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసుల ప్రత్యేక దళం (స్పెషల్ సెల్) సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో ఆత్మాహుతి దాడుల కోసం శిక్షణ పొందుతున్న ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకరు భోపాల్‌కు చెందిన అద్నాన్ కాగా.. మరొకరు మధ్యప్రదేశ్‌కు చెందినవారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఓ రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారు. నిందితులకు ఐసిస్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. విచారణ సందర్భంగా ఢిల్లీలో ఆత్మాహుతి దాడికి ప్లాన్ చేసినట్లు వారు అంగీకరించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వారి నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పలు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై మరింత సమాచారం రాబట్టేందుకు విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

## కేరళలో ఇన్‌స్టంట్ మ్యారేజ్ రిజిస్ట్రేషన్

తిరువనంతపురం : కేరళలో వివాహాల రిజిస్ట్రేషన్లు డిజిటల్ బాట పడుతున్నాయి. నవ దంపతులు స్థానిక సంస్థల కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లోనే వివాహ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. వధూవరులు ఆధార్ ఆధారిత ఓటీపీ లేదా ఈ-మెయిల్ ఆథెంటికేషన్ ద్వారా తమ గుర్తింపు తనిఖీలను పూర్తి చేసుకోవచ్చు. తనిఖీ పూర్తయిన తర్వాత వెంటనే డిజిటల్లీ డౌన్‌లోడబుల్ సర్టిఫికేట్లు వస్తాయి. ఈ ధోరణి కేరళలో ఊపందుకుంటున్నది. 2024 జనవరి నుంచి 2025 సెప్టెంబరు మధ్య కాలంలో 1,44,416 వివాహాలు నమోదు కాగా, వీటిలో 62,524 వివాహాల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లోనే జరిగింది.

## వొడాఫోన్ యాడ్స్ సృష్టికర్త ఇకలేరు!

**అడ్వర్టైజింగ్ నిపుణుడు పియూష్ పాండే (70) కన్నుమూత**



ముంబై: భారత ప్రకటనల రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న దిగ్గజం, పద్మశ్రీ అవార్డు గ్రహీత పియూష్ పాండే (70) శుక్రవారం కన్నుమూశారు. ఫెవికాల్, వొడాఫోన్ పగ్ యాడ్స్ వంటి ఎన్నో మరపురాని ప్రకటనలతో కోట్లాది మంది భారతీయుల మనసుల్లో నిలిచిపోయిన ఆయన మృతితో యాడ్స్ ప్రపంచంలో విషాదం నెలకొంది. ఫెవికాల్ యాడ్స్‌లో కనిపించే హాస్యం నుంచి క్యాడ్‌బరీ 'కుచ్ ఖాస్ హై'లోని మాధుర్యం వరకు, ఏషియన్ పెయింట్స్ 'హర్ ఖుషీ మే రంగ్ లాయే' నుంచి వొడాఫోన్ పగ్ యాడ్ వరకు ఆయన సృష్టించిన ప్రతి ప్రకటన భారతీయ జనజీవనంలో భాగమైపోయింది. సామాన్యుడి భావోద్వేగాలను పట్టుకుని, వాటిని అద్భుతమైన కథలుగా మలచడంలో ఆయనది అందెవేసిన చేయి. వాణిజ్య ప్రకటనలకే పరిమితం కాకుండా, రాజకీయ రంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోసం ఆయన రూపొందించిన 'అబ్ కీ బార్, మోదీ సర్కార్' నినాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.


## మా జోలికొస్తే ఊరుకోం

**అమెరికాకు పుతిన్ తీవ్ర హెచ్చరిక**

మాస్కో: అమెరికా విధించిన కొత్త ఆంక్షలను ఒకవైపు తేలిగ్గా తీసుకుంటూనే, మరోవైపు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్. ఆంక్షల వల్ల తమ ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ప్రభావం ఉండదని స్పష్టం చేసిన ఆయన, ఒకవేళ తమపై క్షిపణులతో దాడి చేసే సాహసం చేస్తే మాత్రం ప్రతిస్పందన చాలా తీవ్రంగా ఉంటుందని అమెరికాను హెచ్చరించారు. రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు సంస్థలు- రోస్‌నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా బుధవారం ఆంక్షలు విధించింది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత రష్యాపై ఆంక్షలు విధించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో గురువారం పుతిన్ మీడియాతో మాట్లాడారు. "ఈ ఆంక్షలు కచ్చితంగా తీవ్రమైనవే. వాటి వల్ల కొన్ని పరిణామాలు ఉంటాయి. కానీ, మా ఆర్థిక వ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేయలేవు" అని ఆయన అన్నారు. ఇది ఒక స్నేహపూర్వక చర్య కాదని, ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్న రష్యా-అమెరికా సంబంధాలను ఇది దెబ్బతీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. తన పదవీకాలం ప్రారంభంలో రష్యాతో సత్సంబంధాలు నెరపాలని ట్రంప్ ప్రయత్నించారు. అయితే, కాల్పుల విరమణకు పుతిన్ అంగీకరించకపోవడంతో ట్రంప్ అసహనానికి గురయ్యారు. పుతిన్‌తో బుడాపెస్ట్‌లో జరగాల్సిన శిఖరాగ్ర సమావేశం కూడా రద్దు కావడంతో ఆయన సహనం కోల్పోయి తాజా ఆంక్షలకు ఆదేశించారు.

## గూగుల్ మ్యాప్స్, యూట్యూబ్‌ను ఢీకొట్టడం అసాధ్యం

**పర్‌ప్లెక్సిటీ సీఈవో అరవింద్ శ్రీనివాస్**



చెన్నై: గూగుల్ ఎకోసిస్టంలోని పలు ఉత్పత్తులను మళ్లీ క్రియేట్ చేయడం కష్టమే అయినప్పటికీ, అసాధ్యం కాదని ఏఐ ఆధారిత సెర్చింజన్ 'పర్‌ప్లెక్సిటీ' సీఈవో అరవింద్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. అయితే, గూగుల్ మ్యాప్స్, యూట్యూబ్‌లను అధిగమించడం మాత్రం అత్యంత కష్టమని, అది అసాధ్యం కూడా కావచ్చని ఆయన పేర్కొన్నారు. మిగిలిన గూగుల్ ఉత్పత్తులు కష్టమైనప్పటికీ అసాధ్యం కాదని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. గూగుల్ ఉత్పత్తులను ఉద్దేశించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గూగుల్ ఎకోసిస్టంలోని యాప్స్ జాబితాను ఒక యూజర్ పోస్ట్ చేస్తూ, ఏ స్టార్టప్ కూడా వీటిని ఓడించలేదని పేర్కొన్నాడు. దీనికి సమాధానంగా అరవింద్ శ్రీనివాస్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందించారు. కొంతమంది గూగుల్ ఎకోసిస్టంను ఎందుకు భర్తీ చేయలేమో వివరిస్తే, మరికొందరు భవిష్యత్ టెక్ మార్పులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## మూన్ లైటింగ్.. భారత సంతతి వ్యక్తి అరెస్ట్

**నేరం రుజువైతే 15 ఏళ్ల జైలు శిక్ష**

న్యూయార్క్: అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి భారీ మోసానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై అరెస్టయ్యాడు. ఒకే సమయంలో రెండు పూర్తిస్థాయి ఉద్యోగాలు చేస్తూ (మూన్ లైటింగ్) ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశాడన్న అభియోగాలపై పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేరం రుజువైతే అతనికి 15 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. వివరాల్లోకి వెళితే, న్యూయార్క్‌లోని సరటోగా కౌంటీలో నివసిస్తున్న 39 ఏళ్ల మేహుల్ గోస్వామిని స్థానిక షెరీఫ్ కార్యాలయం అరెస్ట్ చేసింది. అతను న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్ (%ఝూ%)లో రిమోట్ ఉద్యోగిగా పనిచేస్తూనే, మాల్టాలోని మరో సంస్థలో కూడా పూర్తిస్థాయి ఉద్యోగం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ విధంగా అతను ప్రభుత్వానికి 50,000 డాలర్లకు (సుమారు రూ. 44 లక్షలు) పైగా నష్టం కలిగించాడని అధికారులు ఆరోపిస్తున్నారు. అతనిపై సెకండ్-డిగ్రీ గ్రాండ్ లార్సెనీ కింద కేసు నమోదు చేశారు.




వయ్యారి చిత్రం



## శ్రీలంకలో 'పెద్ది'

పెద్ది సినిమా నుంచి మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. షూటింగ్ ప్రస్తుతం జెట్ స్పీడ్‌లో జరుగుతోంది. ఇప్పటికే 60 శాతం చిత్రీకరణ పూర్తయిందని దర్శకుడు బుచ్చిబాబు రీసెంట్‌గా తెలిపారు. ఇప్పుడు, నెక్స్ట్ షెడ్యూల్ కోసం చిత్రయూనిట్ విదేశాలకు పయనమైంది. రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు, ఇతర టీమ్ సభ్యులు తాజాగా శ్రీలంకకు వెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో చరణ్ స్టైలిష్ లుక్‌లో కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ శ్రీలంక షెడ్యూల్ వెనుక ఉన్న అసలు ప్లాన్ ఏంటంటే, అక్కడ ఒక బ్యూటిఫుల్ సాంగ్‌ను షూట్ చేయడమే. ఈ పాటను హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్‌పై చిత్రీకరించనున్నారు. శ్రీలంకలోని అందమైన లొకేషన్లలో ఈ రొమాంటిక్ లేదా మెలోడీ సాంగ్‌ను తెరకెక్కించనున్నారు. ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో, ఈ పాటపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## ఎస్ఎస్ఎంబీ29 పాటల రికార్డింగ్ షురూ



ఎస్ఎస్ఎంబీ29పై కీరవాణి తనయుడు, యంగ్ కంపోజర్ కాల భైరవ ఓ లీక్ ఇచ్చాడు. రోషన్ కనకాల 'మౌగ్లీ 2025' ఫస్ట్ సింగిల్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ, కాల భైరవ ఈ క్రేజీ అప్‌డేట్‌ను బయటపెట్టారు. ఇది మహేష్ బాబు ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇచ్చింది. కాల భైరవ చెప్పిన దాని ప్రకారం, ఎం.ఎం. కీరవాణి ఇప్పటికే యస్‌యస్ఎమ్‌బీ29 పాటల రికార్డింగ్‌ను మొదలుపెట్టేశారు. అంతేకాదు, ఈ మ్యూజికల్ జర్నీలో తాను కూడా ఒక చిన్న భాగం పంచుకుంటున్నట్లు కాల భైరవ తెలిపారు. ఇది చాలా ఆసక్తికరమైన విషయం. ఆస్కార్ విన్నర్ అనుభవానికి, యంగ్ జనరేషన్ కంపోజర్ ఫ్రెష్ ఐడియాస్ తోడైతే, ఆల్బమ్ ఏ రేంజ్‌లో ఉండబోతోందో ఊహించుకోవచ్చు. సినిమా షూటింగ్ ఇంకా కొనసాగుతుండగానే, పాటల రికార్డింగ్ మొదలుపెట్టారంటే, రాజమౌళి ప్లానింగ్, విజన్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



## రజనీ-కమల్ మల్టీ స్టారర్‌పై అదిరే అప్‌డేట్!

రజనీకాంత్ కూతురు ఐశ్వర్య ఊహించని కామెంట్లు చేసింది. 'నాన్న రజనీకాంత్ , మామయ్య కమలహాసన్ కలిసి ఇప్పుడు మల్టీ స్టారర్ సినిమా చేస్తున్నారు. అయితే కమలహాసన్ మామ బ్యానర్ పైనే ఈ సినిమా రూపుదిద్దుకుంటుంది . ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి . త్వరలోనే నాన్న అన్ని విషయాలు సరైన సమయంలో వెల్లడిస్తారు' అంటూ ఐశ్వర్య చెప్పుకొచ్చింది. ఇకపోతే ఐశ్వర్య చేసిన ఈ కామెంట్లతో ఈ మల్టీస్టారర్ మూవీలో ఎవరెవరు నటించబోతున్నారు? కథ ఎలాంటిది? అనే విషయంపై అభిమానులలో ఊహాగానాలు మొదలయ్యాయి. మరోవైపు సౌందర్యతో పాటు శృతిహాసన్ కూడా తన ఉత్సాహాన్ని వ్యక్తం చేసింది." మనమందరం వారిద్దరిని కలిసి చూడాలని కలలు కన్నాము. ఆ ఒక్క సినిమా కోసం అందరిలాగే నేను కూడా ఎదురు చూస్తున్నాను. నాకు ఇష్టమైన రజినీ సార్ సినిమా పడయప్ప. (తెలుగులో నరసింహా). ఇక ఆయనతో కలిసి పనిచేయడం నాకు మరింత ఇష్టం" అంటూ శృతిహాసన్ చెప్పుకొచ్చింది. మొత్తానికైతే ఈ మల్టీ స్టారర్ సినిమా కోసం అభిమానులే కాదు వారి వారసురులు కూడా ఎదురుచూస్తున్నారు అని తెలిసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## ఇమాన్వీ.. సైలెన్స్ ఎందుకో!

ఇండస్ట్రీలో హీరోయిన్ అవకాశం అంటే గ్రాండ్ గా భావించి తమని తాము తెలివిగా ప్రమోట్ చేసుకుంటున్నారు. దీంతో తర్వాత చిత్రాల్లో అవకాశాలు ఈజీ అవుతున్నాయి. ఫ్లాప్ ల్లో ఉన్న భామలు కూడా ఇప్పటికీ అవకాశాలు అందుకుంటున్నారు? అంటే కారణం పాపులారిటీ అన్నది ఎంతగా పనికొస్తుందన్నది అద్దం పడుతుంది. కానీ పాన్ ఇండియా సినిమా 'ఫౌజీ' లో ఛాన్స్ అందుకుని కూడా ఇమాన్వీ సైలెంట్ గా ఉంటం అన్నది ఆశ్చర్యంగా ఉంది. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న చిత్రంలో ఇమాన్వీ హీరోయిన్ గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రభాస్ కి జోడీగా ఎంపిక చేసే విషయంలో దర్శకుడు హనురాఘవపూడి పెద్ద యుద్ధమే చేసాడు. ఎంతో మంది హీరో యిన్లను..బాలీవుడ్ నటీమణుల్ని ఎంతో మంది పరిశీలించి..టెస్ట్ షూట్ నిర్వహించి ఫైనల్ గా ఇమాన్వీని ఎంపిక చేసాడు. అధికారికంగా విషయాన్ని వెల్లడించాడు. అందం..అభినయంతో ఇమాన్వికి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది. ఫౌజీ సెట్స్ కి వెళ్లిన కొన్ని నెలల అనంతరం ఇమాన్వీ ఓ డాన్స్ వీడియో కూడా షేర్ చేసింది. ఆ వీడియో తో తనలో డాన్సింగ్ స్కిల్స్ బయట పడ్డాయి.



## స్టార్ నటులకు ఈడీ సమన్లు!

ఇద్దరు స్టార్ హీరోలకు కొకైన్ సరఫరా, మనీ లాండరింగ్ కేసులో ఈడీ సమన్లు జారీ చేయడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. వారు ఎవరో కాదు కోలీవుడ్ నటులుగా పేరు సొంతం చేసుకున్న శ్రీకాంత్, కృష్ణ. అక్రమ రవాణాకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో శ్రీకాంత్ అలియాస్ శ్రీరామ్ తో పాటు కృష్ణ లకు ఇప్పుడు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో అక్టోబర్ 27న శ్రీకాంత్.. 28న కృష్ణ విచారణకు హాజరు కావాలి అని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేయడం గమనార్హం. ఇకపోతే మాదకద్రవ్యాల రవాణాకు సంబంధించి ఈ ఏడాది జూన్లో చెన్నై పోలీసులు వీరిద్దరిపై ఎఫ్ ఐ ఆర్ ఫైల్ చేసిన విషయం తెలిసిందే. దీని ఆధారంగానే ఇప్పుడు మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది ఈడీ.



## మలైకా.. అబద్ధాలు!

పుట్టిన రోజు విషయంలో అబద్ధం చెప్తూ అడ్డంగా దొరికిపోయింది మలైకా అరోరా. ఈ బ్యూటీ ఇటీవల తన బర్త్ డే పార్టీతో మరోసారి చర్చల్లోకొచ్చింది. ప్రస్తుతం మలైకా పుట్టినరోజు వేడుకల ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ గా మారుతున్నాయి. అయితే ఈసారి బర్త్ డేలో మలైకా ఊహించని విధంగా అడ్డంగా దొరికిపోయింది. బర్త్ డే కేక్ పై 50 నంబర్ అందరి దృష్టిని ఆకర్షించింది. దీని అర్థం మలైకా వయసును ఫేకింగ్ చేస్తోందా? అంటూ పలువురు నెటిజనులు ఆరాలు తీయడం ప్రారంభించారు. అంతేకాదు కొందరు ఇంకాస్త ముందుకు వెళ్లి మలైకా 2019లో 47వ బర్త్ డే వేడుకలు జరుపుకున్న వీడియోలు ఫోటోలను కూడా కనిపెట్టి వెలికి తీసారు. ఒకవేళ 2019లో 47వ బర్త్ డే జరుపుకున్నట్టయితే, 2022 నాటికి మలైకా వయసు 50. కానీ 2025లో వయసు 50కి ఎలా తగ్గిపోయింది? అంటూ ప్రశ్నించడంతో అడ్డంగా దొరికిపోయింది.

## రియా చక్రవర్తికి క్లీన్ చిట్!



సుశాంత్ సింగ్ రాజ్ పుత్ ఆకస్మిక మృతిని అనుమానాస్పద మరణంగా భావించి పలు ఏజెన్సీలు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసులో సుశాంత్ సింగ్ ప్రియురాలు రియా చక్రవర్తి పై తీవ్ర అభియోగాలు మోపారు. అయితే అన్ని కేసుల నుంచి నిర్ధోషిగా తనను తాను నిరూపించుకుని రియా బయటపడిన సంగతి తెలిసిందే. అయితే సుశాంత్ మరణానంతరం రియా చక్రవర్తిపై అతడి కుటుంబీకులు తీవ్ర ఆరోపణలు చేసారు. అతడి నుంచి కోట్లాది రూపాయల డబ్బును రియా దుర్వినియోగం చేసిందని, డబ్బును దారి మళ్లించిందని, అలాగే డ్రగ్స్ అధిక మోతాదు ఇచ్చి అతడి మరణానికి కారణమైందని కూడా వారు ఆరోపించారు. రియా చక్రవర్తి అతడి కుటుంబీకులు సుశాంత్ సింగ్ ని ఆర్థిక అవసరాల కోసం ఉపయోగించుకున్నారని కూడా ఆరోపించారు. అయితే ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రకారం... 14నెలల సహజీవనంలో సుశాంత్ సింగ్ 16.80 లక్షలు ఖర్చు చేసాడు. దీనిని డబ్బు దుర్వినియోగం అని భావించలేమని సీబీఐ పేర్కొంది. సుశాంత్ సింగ్ అప్పటికి డిప్రెషన్, ఆందోళనకు సంబంధించిన మందులు వాడుతున్నాడు. అతడు అధిక మోతాదు తీసుకోలేదు. వైద్యులు సూచించిన మేరకు డోస్ మాత్రమే తీసుకున్నాడు. అని సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది.

## రేవంత్‌కు నారా రోహిత్ పెళ్లి ఆహ్వానం



ఏపీ సీఎం చంద్రబాబు తమ్ముడు కుమారుడి నారా రోహిత్ పెళ్లి పనులు జోరుగా సాగుతున్నాయి. ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్వయంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో రేవంత్ రెడ్డిని కలిసిన నారా రోహిత్.. తన వివాహానికి కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా రోహిత్ కి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే తుమ్మల నాగేశ్వరరావు, వేం నరేందర్ రెడ్డి, రోహిన్ రెడ్డిలను కూడా రోహిత్ తన పెళ్లికి ఆహ్వానించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలను రేవంత్ రెడ్డి సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ విషయాలు కాస్త వైరల్ గా మారాలి.



# ధనశ్రీపై చాహల్ సెటైర్!

భారత స్టార్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ తన మాజీ భార్య ధనశ్రీ వర్మతో విడాకుల తర్వాత సోషల్ మీడియాలో మరోసారి సంచలనం సృష్టించాడు. ఈ పోస్ట్‌లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పు గురించి ప్రస్తావించాడు. ఆ తీర్పులో "ఆర్థికంగా స్వతంత్రంగా ఉన్న భార్యలు తమ భర్తల నుంచి భరణం డిమాండ్ చేయలేరు" అని ఉంది. ఈ కోర్టు తీర్పును ప్రస్తావిస్తూ.. యుజ్వేంద్ర చాహల్ ఈ పోస్ట్‌పై తనదైన శైలిలో కామెంట్ చేశాడు. చాహల్ "అమ్మ మీద ఒట్టు పెట్టు, ఈ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గను" అని హిందీలో రాశారు. ఇది ధనశ్రీ వర్మను ఉద్దేశించి చేసిన వ్యంగ్యాస్త్రంగా కనిపిస్తోంది. యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మల విడాకులు 2025 మార్చి 20న బాంబే హైకోర్టులో ఖరారు అయ్యాయి. 2020 డిసెంబర్‌లో వివాహం చేసుకున్న ఈ జంట 2022 జూన్‌లో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. విడాకుల తర్వాత యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మకు భరణంగా రూ. 4.75 కోట్లు చెల్లించాల్సి వచ్చింది.

# నేడు రో-కో ఆఖరి మ్యాచ్!

ఆస్ట్రేలియాతో సిడ్నీలో శనివారం జరగబోయే మూడో వన్డేనే రోహిత్, కోహ్లీకి చివరి మ్యాచ్ అయ్యే అవకాశం ఉందా? అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. ఈ నెల 23న జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోని రెండో వన్డేలో 97 బంతుల్లో 73 పరుగులు చేసి కొంత ఊరట పొందాడు. అయితే విరాట్ కోహ్లీ మాత్రం ఈ సిరీస్‌లో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ డకౌట్ అయ్యాడు. వన్డే క్రికెట్ చరిత్రలో కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌లలో డకౌట్ అవ్వడం ఇదే తొలిసారి. కోహ్లీ వరుస వైఫల్యం, రోహిత్-కోహ్లీల వయస్సుపై వస్తున్న కామెంట్లు.. కోహ్లీ



# ట్రోఫీ కోసం గంట సేపు ఆగాం.. కానీ..!



ఆసియాకప్ ట్రోఫీ ప్రెజెంటేషన్ కోసం భారత జట్టు ఎంత సమయం ఎదురు చూసిందో తిలక్ వర్మ వెల్లడించారు. "మేము నిజానికి ఓ గంటపాటు మైదానంలోనే ఎదురు చూశాం. టీవీ విజువల్స్‌లో చూస్తే ఆ సమయంలో నేను అలసిపోయి మైదానంలో పడుకుని ఉండటం కనిపిస్తుంది. మిగిలిన జట్టు సభ్యులు కూడా అలాగే పడుకున్నారు," అని తిలక్ వర్మ ఆ రోజు పరిస్థితిని వివరించారు. అయితే ఆ సమయంలో ఏం జరుగుతోందో ఆటగాళ్లకు తెలియదని తిలక్ స్పష్టం చేశారు. "ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ రీల్స్ చేయడంలో బిజీగా ఉన్నాడు. ట్రోఫీ ఇప్పుడే వస్తుందని అనుకుంటూ మేము నిరీక్షించాం. కానీ ఒక గంట గడిచినా ట్రోఫీ మాత్రం ఎక్కడా కనిపించలేదు" అని మొహ్సిన్ నఖ్వీ చర్య గురించి తమకు తర్వాతే తెలిసిందని తిలక్ వర్మ పేర్కొన్నారు. ఎంతకీ ట్రోఫీ రాదని స్పష్టమైన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా నిరాశ చెందకుండా, తమ విజయాన్ని ప్రత్యేక పద్ధతిలో సెలబ్రేట్ చేసుకోవాలని నిర్ణయించుకుంది. 2024 టీ20 ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ జట్టు చేసిన ఐకానిక్ స్లో-మోషన్ వాక్ తరహాలో ఆసియా కప్ ట్రోఫీ లేకుండానే హాస్యాస్పదంగా వేడుకలు చేసుకున్నారు. ఈ ప్రత్యేకమైన నో-ట్రోఫీ వేడుక ఆలోచన అర్ష్‌దీప్ సింగ్‌దే అన తిలక్ వర్మ తెలిపారు. "మనం ఒక మంచి వాతావరణాన్ని సృష్టిద్దాం అని అర్ష్‌దీప్ అన్నాడు. ట్రోఫీ లేకుండానే 2024 టీ20 ప్రపంచ కప్‌లో సెలబ్రేట్ చేసుకున్న విధంగానే చేద్దామని చెప్పాడు. "అభిషేక్ శర్మ, నేను, మరో 5-6 మంది దానికి వెంటనే సరే అన్నాం. ఆ తర్వాత మేము ఆ ఐకానిక్ స్టైల్‌లో సెలబ్రేషన్‌ను కొనసాగించాం" అని తిలక్ వివరించారు.



# సహనంగా ఉండు కోహ్లీ: ఇర్ఫాన్ పఠాన్

వరుసగా రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడంతో విరాట్ కోహ్లీ ఇక ఆటకు గుడ్‌బై చెబుతాడనే చర్చ మొదలైంది. అయితే, ఇందులో పెద్దగా కంగారుపడాల్సిన అవసరమేమీ లేదని మాజీలు సూచించారు. ఒక్కసారి పరుగులు చేయడం మొదలుపెడితే ఆటోమేటిక్‌గా లయను అందుకుంటాడని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ తెలిపాడు. రెండు డకౌట్‌లు అయినంత మాత్రాన రిటైర్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు. "ఇప్పటివరకు మనం విరాట్ కోహ్లీ వరుసగా రెండు మ్యాచుల్లో డకౌట్ కావడం చూడలేదు. ఇలా జరగడానికి ఒత్తిడి, ఆటకు దూరమవడం వంటి కారణాలు ఉండొచ్చు. సోషల్ మీడియాలో మాత్రం దీనిపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది. విరాట్‌తోపాటు రోహిత్ విషయంలోనూ ఇదే డిస్కషన్. భారత్ కోసం వారిద్దరూ చాలా సాధించారు. ఇలాంటప్పుడు వారికి మద్దతు కావాలి. పరుగులు చేసేవరకూ సెలక్టర్లు నమ్మకం ఉంచాలి.

# క్లీన్ స్వీప్ భయం!

## నేడే మూడో వన్డే.. గెలిస్తే నిలిచే పరువు

**ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ను టీమిండియా కోల్పోయింది. ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 0-2 తేడాతో ఆసీస్ జట్టుకు సిరీస్ ను అప్పగించింది. శనివారం (అక్టోబర్ 25) సిడ్నీ వేదికగా ఇరు జట్ల మధ్య నామమాత్రపు మ్యాచ్ జరగనుంది. చివరి వన్డేలోనూ గెలిచి ఇండియాను క్లీన్ స్వీప్ చేయాలని ఆతిధ్య ఆస్ట్రేలియా భావిస్తోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్ కోల్పోయిన భారత జట్టు చివరి వన్డేలో గెలిచి పరువు నిలుపుకోవాలని చూస్తుంది.**

టాస్ ఉదయం 9:00 గంటలకు వేస్తారు. సిడ్నీ వన్డేలో ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్లు స్టార్క్, హేజల్ వుడ్ లకు రెస్ట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో నెల రోజుల్లో యాషెస్ ఉ ండడమే ఇందుకు కారణం. ఎలాగో సిరీస్ వచ్చింది కాబట్టి బెంచ్ ను పరీక్షించే అవకాశాలు లేకపోలేదు. స్టార్క్, హేజల్ వుడ్ స్థానాల్లో నాథన్ ఎల్లిస్, బెన్ ద్వార్షుయిస్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏ రెండు మార్పులు మినహాయిస్తే రెండో వన్డేలో ఆడిన జట్టుతోనే ఆసీస్ ఆడొచ్చు. బ్యాటింగ్ లో ఎలాంటి మార్పులు చేసే అవకాశాలు కనిపించడం లేదు. సిడ్నీ వన్డేలో వాషింగ్ టన్ సుందర్ స్థానంలో స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కు తుది జట్టులో స్థానం దక్కొచ్చు. తొలి రెండు వన్డేల్లో సుందర్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పెద్దగా ఆకట్టుకోలేక పోయాడు. కుల్దీప్ ను ప్లేయింగ్ 11 లో చేర్చి స్పిన్ బౌలింగ్ లో బలహీనమైన ఆస్ట్రేలియాకు చెక్ పెట్టాలని ఇండియా భావిస్తోంది. ఫాస్ట్ బౌలర్లుగా సిరాజ్ తో పాటు అర్షదీప్ కొత్త బంతిని పంచుకోనున్నాడు. హర్షిత్ రానా ఉంటాడా లేదా అనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఓపెనర్లుగా కెప్టెన్ గిల్ తో పాటు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఇన్నింగ్స్ ను ఆరంభించనున్నారు. టాలెంటెడ్ బ్యాటర్ యశస్వి జైశ్వాల్ బెంచ్ కే పరిమితం కానున్నాడు. మూడో స్థానంలో కోహ్లీ స్థానానికి తిరుగులేదు. నాలుగో స్థానంలో వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బరిలోకి దిగుతాడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ గా రాహుల్ బ్యాటింగ్ చేయనున్నాడు. ఆరో స్థానంలో ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి.. ఏడో స్థానంలో స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ఏడో స్థానంలో బరిలోకి దిగనున్నారు.

**ఇండియా ప్లేయింగ్ 11 (అంచనా): రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రానా, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్**




# రోహిత్ రిటైర్మెంట్‌పై గంభీర్ క్లారిటీ

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే 0-2 తేడాతో ఓటమి పాలైంది. ఈ సిరీస్‌లోని రెండో మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ప్రదర్శనపై ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యంగా హిట్ మ్యాన్ ఈ మ్యాచ్‌లో విఫలమైతే జట్టు నుంచి తొలగించవచ్చని, రోహిత్ అంతర్జాతీయ కెరీర్ కు ప్రమాదం పొంచి ఉందని ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, రోహిత్ శర్మల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఓ వీడియో క్లిప్ విపరీతంగా వైరల్ అవుతోంది. భారత్-ఆస్ట్రేలియా వన్డే సిరీస్ జరుగుతున్న సమయంలో తెరవెనుక జరిగిన ఈ సంభాషణలో కోచ్ గౌతమ్ గంభీర్ రోహిత్‌తో సరదాగా మాట్లాడారు. వైరల్ అవుతున్న ఆ వీడియోలో గౌతమ్ గంభీర్ రోహిత్‌తో మాట్లాడుతూ, "రోహిత్, అందరూ ఈరోజు నీకు వీడ్కోలు మ్యాచ్ (ఫేర్‌వెల్ మ్యాచ్) అని అనుకున్నారు. కనీసం ఒక ఫోటో అయినా అప్‌లోడ్ చెయ్యి" అని సరదాగా అన్నారు.







# కళ.. కలకు జీవం!

కళ, ఓ అమృత ఝరి, హృదయ తామరలో తాకే,
రాగాల రంగులతో జీవన చిత్రం ఆకే.
కళాకారుడు, సృష్టి సౌందర్యాన స్వరం,
మనసు తడమగల కాంతుల కిరణం.
పుష్పంలో రాగమై, గాలిలో సంగీతమై,
చిత్రంలో ఊహలై, కావ్యంలో భావమై..
కళాకారుని చేతిలో కలలు జీవం పోసుకునే,
మౌనంలోనూ స్వరాలు కనుగొనే.
శిల్పంలో శ్వాసనిచ్చే, నాట్యంలో లయనూ అల్లే,
వీణలో వేదం పలికే, కవితలో హృదయం మల్లె..
ఓ కళాకారా, నీవు దేవుని దివ్య రాగమై,
ప్రపంచానికి అందిస్తావు అమర సౌందర్య భాగమై!

నేటి ప్రత్యేక 'కథ': నేడు అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం



మనం చేసే ప్రతీ పనిలో మన కళ దాగి ఉంటుంది. దేనినైనా సృజనాత్మకంగా చేస్తే అది కళే అవుతుంది. అలా కాకుండా కొన్ని కళలు ఉంటాయి. వాటిల్లో ప్రేకంగా నైపుణ్యం సంపాదించవలసి ఉంటుంది. మనకు మొత్తం 64 కళలు ఉన్నాయి. అందులో చోర కళ తప్పించి మిగతావన్నీ ప్రత్యేకమైనవి. మనకు ప్రాచీన కాలం నుంచీ కళలు ఉన్నాయి. చరిత్రలో వీటిని ప్రత్యేకంగా చెప్పకపోయినప్పటికీ ఆదిమ మానవులు వేసిన చిత్రాల ద్వారా అవి మనకు తెలుస్తాయి. అసలు ఆ చిత్రాలు వేయడమే ఓ పెద్ద కళ. తర్వాత తర్వాత పాటలు, డాన్సులు లాంటివి అన్నీ కళలుగా ప్రసిద్ధిగాంచాయి. వీటిల్లో అనేకమంది కళాకారులు నిష్ణాతులు అయ్యారు. క్రియేటివ్ పనులు చేసే వారి కోసమే ఈరోజు. కళల్లో నిష్ణాతులు అయిన వారి గౌరవార్థం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వాళ్ళల్లో ఉన్న క్రియేటివ్ ను మరింత ప్రోత్సాహించడానికే ఈరోజును పెట్టారు. కళాకారులు చేసే సృజన అందరికీ సాధ్యం కాదు. వారిలో ఎంతో టాలెంట్ ఉంటే కానీ అదభుతమైన కళారూపాలు బయటికి రావు. వాళ్ళు దాని కోసం రాత్రంబవళ్ళు కష్టపడతారు. దానికి గుర్తింపుగానే ఈ కళాకారుల దినోత్సవం వచ్చింది. రొమాంటిక్ రియలిజమ్ లో స్పెషలిస్ట్ అయిన క్రిస్ మెక్ క్లయిర్ అనే కెనడియన్ అనే ఆర్టిస్ట్ ఈ కళాకారుల దినోత్సవాన్ని మొదలుపెట్టారు అని చెబుతారు. తనకు ఇష్టమైన స్పానిష్ చిత్రకారుడు పాబ్లో పికాసో పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఈ రోజును ప్రారంభించారు.

## చిత్రానికి ప్రాణం.. పికాసో కుంచె

పాబ్లో పికాసో.. ఒక స్పానిష్ చిత్రకారుడు, శిల్పి. 20వ శతాబ్దపు కళా ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన కళాకారులలో ఒకడు. అతని గొప్పదనం కళాత్మక ఆవిష్కరణలు, వైవిధ్యం, సాంస్కృతిక ప్రభావంలో ఉంది. పికాసో, జార్జెస్ బ్రాక్‌తో కలిసి, క్యూబిజం అనే కళా ఉద్యమాన్ని సృష్టించాడు. ఈ శైలి వస్తువులను జ్యామితీయ ఆకృతులుగా విభజించి, ఒకేసారి బహుళ కోణాల నుండి చూపించడం ద్వారా సంప్రదాయ దృశ్య కళను విప్లవాత్మకంగా మార్చింది. పికాసో ఒకే శైలికి పరిమితం కాలేదు. అతను బ్లూ పీరియడ్ (విషాద రంగులు), రోజ్ పీరియడ్ (ప్రేమ, సున్నితత్వం), క్లాసికల్ పీరియడ్, సర్రియలిజం, మరియు ఇతర శైలులలో పనిచేశాడు. ఈ వైవిధ్యం అతని సృజనాత్మక శక్తిని అన్వేషణా దృష్టిని ప్రదర్శిస్తుంది. పికాసో (1937) చిత్రం స్పానిష్ గృహయుద్ధంలో గ్వెర్నికా బాంబు దాడి యొక్క భీభత్సతను చిత్రీకరించి, యుద్ధ వ్యతిరేక సందేశంగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధమైంది. ఈ చిత్రం కళ రాజకీయంగా శక్తివంతంగా ఉంటుందని నిరూపించింది. పికాసో తన జీవితంలో సుమారు 50,000 కళాఖండాలను సృష్టించాడు. ఇందులో చిత్రాలు, శిల్పాలు, సిరామిక్స్, డ్రాయింగ్‌లు, ప్రింట్‌లు ఉన్నాయి. అతని నిరంతర సృజనాత్మకత కళాకారులకు స్ఫూర్తిగా నిలిచింది. పికాసో సంప్రదాయ హద్దులను ఛేదించి, కళను స్వీయ వ్యక్తీకరణగా, ఆధునిక ఆలోచనల ప్రతిబింబంగా మార్చాడు. అతని పని ఆధునిక కళా ఉద్యమాలకు దారితీసింది. పికాసో కళ ప్రపంచవ్యాప్తంగా మ్యూజియంలలో ప్రదర్శించబడుతోంది. ఆయన పేరు ఆధునిక కళకు పర్యాయపదంగా మారింది. అతని రచనలు ఇప్పటికీ కళాకారులు, విమర్శకులు, మరియు కళా ప్రేమికులను స్ఫూర్తిపరుస్తున్నాయి.



శశిధర్ అక్కెల

# ఆంధ్రులూ నాగజాతివారే!

కార్తీక శుక్ల పక్ష చవితిని నాగులచవితి అంటారు. ఇది సర్పపూజకు ఉద్దిష్టమైన రోజు. కార్తీక శుద్ధ చవితి రోజు నాగవ్రతం చేయాలని చతుర్వర్గ చింతామణి చెపుతోంది. నాగులు, గరుడులు, వానరులు, రాక్షసులు, అసురులు.. వీరంతా వేర్వేరు జాతుల వారంటారు. అస్సాం దక్షిణ భాగంలోని నాగాయ్ కొండల్లో ఇప్పటికీ నాగజాతి వారున్నారు. నాగులకు, ఆంధ్రులకు ప్రాచీన కాలం నుంచి విశేష సంబంధం ఉంది. భారతావనిలో అనేక ప్రదేశాల్లో నాగజాతి వారున్నట్లు చరిత్ర చెబుతోంది. ఆంధ్రులూ నాగ జాతివారనే వాదనా లేకపోలేదు. బౌద్ధ ధర్మమంటే నాగులకు అనురక్తి ఉన్నట్లు, బుద్ధునికి పరమ భక్తులై నాగులు బౌద్ధాన్ని ఆదరించి, అవలంభించారని అనేక గాథలు చెబుతున్నాయి.

దిక్కులను పాలించే లోకపాలకులకు, నాగులకు సంబంధం ఉన్నట్లు బౌద్ధుల విశ్వాసం. అమరావతి, నాగార్జున కొండతోపాటు అవిభక్త కరీంనగర్ జిల్లాలోని ప్రాచీన ధూళికట్ట తదితర ప్రాంతాల్లో బౌద్ధ శిల్పాల్లో నాగరాజుల, నాగిమల చిత్రాలున్నాయి. భారతావనిలో నాగపూజ ఆది నుంచీ ఉంది. గౌతముడు తన గృహ్య సూత్రాల్లో పేర్కొనగా యజ్ఞ మంత్రాల్లో నాగుల స్తుతిని పేర్కొన్నారు. నాగశిలలు, నాగ కల్లులూ, ప్రతిమలు ప్రతి చోటా దర్శనమిస్తాయి. పుట్టిన బిడ్డలు చనిపోతుంటే సంతానం నిలవడానికి నాగ ప్రతిష్ఠలు చేయడం, ఆరాధించడం ఆచారంగా ఉంది. పాములు భూమి అంతర్భాగంలో నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి "నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ పరోక్షంగా "రైతు"కు పంట నష్టం కలగకుండా చేస్తాయి. ఇలా ప్రకృతి పరంగా అవి మనకు ఎంతో సహాయపడుతూ ఉంటాయి. ఆది నుంచీ ఆంధ్రులు నాగారాధకులుగా ఉన్నారు. 5 తలల పాములను వెండితో గానీ, మట్టితో గానీ చేసి పూజించడం ఆచారం. చెవిలో చీము పట్టినా, వినపడక పోయినా, చెవులను బంగారు, వెండితో చేయించి శివాలయాలకు సమర్పించడం పరిపాటి. అనంత, వాసుకి, శేష, పద్మనాభ కంబల, కర్కోటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళి అనే 12 రకాల సర్పాలను ఒక్కో నెలలో పూజించడం ప్రాచీన సంప్రదాయం. ప్రపంచంలో శాస్త్రవేత్తలకు తెలిసిన దాదాపు అన్ని రకాల పాములున్న దేశం మనదే. మానవుడి మానసిక శక్తికి హిందూ దేశంలో పాము చిహ్నం. మానసిక శక్తికి వేదాంత పరిభాషలో కుండలినీ శక్తి అని పేరు. నిస్సంగుల తపస్సు అంతా ఈ కుండలినీ శక్తిని లేపుటకే. కుండలినీ శక్తిని గ్రీకు భాషలో "స్పైరిమా" అంటారు. స్పైరిమా అంటే సర్ప వలయం. కుండలినిని సర్పంటైన్ గా పిలుస్తారు. శరీరమనే పుట్టకు 9 రంధ్రాలు ఉంటాయి. వాటినే నవ రంధ్రాలు అంటారు. మానవ శరీరంలో నాడులతో నిండి ఉన్న వెన్నెముకను 'వెన్నుపాము' అని అంటారు. మూలాధారం నుంచి సహస్రారం వరకు వెన్నెముక మధ్య నుంచి సర్పాకారంగా కుండలినీ శక్తి అనే సుషుమ్నా నాడిని లేవ జూపడమే నాగపూజ ప్రధాన ఉద్దేశమని విజ్ఞుల భావన. కుండలినీ శక్తి మూలాధార చక్రంలో పాము ఆకారంలా ఉంటుందని "యోగశాస్త్రం" చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని కక్కుతూ మానవుడిలో 'సత్వగుణ' సంపత్తిని హరించివేస్తూ ఉంటుందని, అందుకు నాగులచవితి రోజున ప్రత్యక్షంగా విష సర్ప పుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవుడిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది అందరి హృదయాల్లో నివసించే 'శ్రీమహావిష్ణువునకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసే సత్కర్మనే నాగుపాము పుట్టలో పాలు పోయుటలోగల అంతర్యమని భావన.



రామ్ మనోహర్ శర్మ
ఆధ్యాత్మిక పండితుడు



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.